ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
గురువారం 12 సెప్టెంబరు 2024





కనగాల వద్ద దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

నష్టపోయాం.. న్యాయం చేయండి



ఫొటో ప్రదర్శనను పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులకు నష్టం వివరాలను తెలియజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు, కలెక్టర్ వెంకటమురళి

- కేంద్ర బృందానికి బాధితుల వినతులు
- వరద ప్రాంతాల్లో కేంద్ర బృందం పర్యటన
- పీపీటీ ద్వారా నష్టం అంచనాలను వివరించిన అధికారులు
- వాణిజ్య పంటలకు చేసిన ఖర్చు గురించి ఆరా తీసిన సభ్యులు
- డ్వాక్రా, పంట రుణాలు రద్దు చేయాలని కోరిన చింతల్లంక మహిళలు

వేమూరు, కొల్లూరు, రేపల్లె / బాపట్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వరద ఊడ్చేసింది. ఒక్క రూపాయి కూడా చేతికొచ్చే పరిస్థితి లేదు. ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. కట్టుబట్టలతో మిగిలాం. ఉద్యాన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వేలాది ఎకరాల్లో వరి పొలాలు నీటమునిగాయి. అన్యాయమయ్యాము. ముంపుతో సర్వస్వం కోల్పోయాం. మీరే మమ్మల్ని ఆదుకోవాలి.. పూర్తిగా నష్టపోయాం.. న్యాయం చేయండి.. అంటూ కేంద్ర బృందానికి వరద బాధితులు గోడువెళ్లబోసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. భారీ వర్షాలు, వరదలతో జరిగిన నష్టాల పరిశీలనకు కేంద్ర బృందం బుధవారం జిల్లాలో పర్యటించింది. మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ విభాగానికి చెందిన డైరెక్టర్ వాఘ్‌మేర్, ఆర్థిక శాఖ కన్సల్టెంట్ కౌల్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌లతో కూడిన ముగ్గురు సభ్యుల కేంద్ర బృందం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించింది. షెడ్యూల్ ప్రకారం రావాల్సిన కేంద్ర బృందం రెండు గంటలు ఆలస్యంగా వేమూరుకు చేరుకుంది. వేమూరులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో కలెక్టర్ వెంకటమురళి అధ్యక్షతన జిల్లా యంత్రాంగంతో కేంద్రబృందం సమీక్షించింది. వరదల వల్ల వివిధ విభాగాలకు జరిగిన నష్టాన్ని పీపీటీ ద్వారా కేంద్ర బృందానికి ఆయా శాఖల అధికారులు వివరించారు. వరద వల్ల జరిగిన నష్టాన్ని ప్రాంతాల వారీగా కేంద్ర బృందానికి కలెక్టర్ ప్రత్యేకంగా నివేదించారు. సమీక్ష అనంతరం బృందంలోని అధికారులు సుగ్గల్లంక, పెసర్లంకలో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. వాణిజ్య పంటలకు జరిగిన నష్టాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి రైతుల నుంచి వివరాలు తీసుకున్నారు. ఓలేరు పల్లెపాలెం, రావి అనంతవరం కరకట్టలను పరిశీలించారు. పంటలకు వరదలు మిగిల్చిన నష్టాన్ని కేంద్ర బృందానికి రైతులు వివరించారు. సుగ్గల్లంకలో వాణిజ్య పంటలకు జరిగిన నష్టంపై రైతులను వివరాలు అడగగా ఒక్క రూపాయి చేతికొచ్చే పరిస్థితి లేదని వాపోయారు. అరటితోటను చూపించి తోటంతా రంగుమారిపోయిందని మొత్తం నష్టపోయినట్లేనని రైతులు వివరించారు. పసుపు, గుమ్మడి రైతుల నుంచి కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు. కనగాల దగ్గర ముంపులో ఉన్న వరి పొలాన్ని బృందం పరిశీలించింది. గత ఐదేళ్లలో కాల్వల మరమ్మతులు చేపట్టకపోవడమే ప్రస్తుత దుస్థితికి కారణమని రైతులు తెలిపారు. సమీపంలోనే జాతీయ రహదారి ఉండడం కూడా ముంపునకు కారణమని, కల్వర్టుల నిర్మాణంపై ఆలోచన చేయాలని కేంద్ర బృందానికి రైతులు నివేదించారు.

కాన్వాయ్‌ను అడ్డుకున్న మహిళలు..

చింతల్లంక, పెదల్లంక గ్రామంలోని మహిళలు కేంద్ర బృందం కాన్వాయ్‌ని అడ్డుకున్నారు. తమకు న్యాయం చేయాలని అధికారులను అభ్యర్థించారు. వరదలతో సర్వస్వం కోల్పోయామని డ్వాక్రా రుణాలతో పాటు పంట రుణాల విషయంలో తమకు కొంత వెసులుబాటు ఇవ్వాలని కేంద్ర బృందాన్ని కోరారు. బ్యాంకర్లతో మాట్లాడి న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో మహిళలు కాన్వాయ్‌కు దారిచ్చారు. చింతల్లంకలో ఓ ఇంటిలోకి వెళ్లి దెబ్బతిన్న గోడలను పరిశీలించడంతో పాటు నష్టంపై యజమానులను అధికారులు ప్రశ్నించారు. పెసర్లంకలో ముంపుతో దెబ్బతిన్న ఓ ఇంటిని పరిశీలించి వివరాలను కేంద్ర బృందం నమోదు చేసుకుంది. చెరుకుపల్లి మండలం కనగాలలో పదిరోజులుగా నీటిలో నానుతున్న వరి పొలాలను చూసి కేంద్రబృందం ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసింది. ఇన్ని వేల ఎకరాలు పంట నష్టపోవటం కనుచూపుమేర నీరు తప్ప పొలం కనిపించకపోవడంతో ఎంత నష్టం వాటిల్లిందని కలెక్టర్‌ను ప్రశ్నించింది. ఇన్నిరోజులుగా పొలాలు నీటిలో నానడం ఏమిటని, దీనిపై ఏమి చర్యలు తీసుకోలేదా డ్రైయినేజీ, ఇరిగేషన్ అధికారులు పనిచేస్తున్నారా అని ప్రశ్నించారు. ఎకరాకు రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టామని నాట్లు వేసి 20 రోజులు అవుతుందని 10 రోజులుగా నీటిలోనే నానుతున్నాయని, ఆదుకోకుంటే అప్పుల పాలవుతామని రైతులు తెలిపారు.



చింతల్లంకలో డ్వాక్రా, పంట రుణాలను రద్దు చేయాలని కలెక్టర్, కేంద్ర బృందం సభ్యులను అడుగుతున్న మహిళలు

కరకట్ట పరిశీలన..

భట్టిప్రోలు మండలం ఓలేరు పల్లెపాలెంతో పాటు రేపల్లె మండలం రావి అనంతవరం కరకట్టలను, అరవింద వారధిని కేంద్ర బృందం పరిశీలించింది. కరకట్టకు వచ్చిన వరద ఉధృతి పరిస్థితులను ఫొటోలతో కేంద్రబృందానికి కృష్ణారివర్ అధికారులు వివరించారు. వాటి భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై ఆరా తీసింది. వరదలు ఉధృతంగా ఉన్న సమయంలో బలహీనంగా ఉన్న కరకట్టల వల్ల బిక్కుబిక్కుమంటూ ఎలా కాలం వెళ్లదీశామో ప్రభావిత ప్రాంతాల ప్రజలు బృందసభ్యులకు వివరించారు. వరదలు వచ్చినప్పుడల్లా తీరప్రాంతంలో కోట్లాదిరూపాయలు నష్టం వాటిల్లుతుందంటూ తెలిపారు. కరకట్టల పటిష్ఠతకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ వివరించగా వారు నివేదికలో పొందుపరుచుకున్నారు. కరకట్టను బలపరిచే విధంగా తగినన్ని నిధులు మంజూరు చేయిస్తే తీరప్రాంత ప్రజలు రుణపడి ఉంటారని వెంకటమురళి చెప్పారు. నీటమునిగిన రావిఅనంతవరం గ్రామాన్ని కూడా కేంద్ర బృందంలోని అధికారులు పరిశీలించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంకటమురళితో పాటు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌లతో ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రూ.వెయ్యి కోట్ల నష్టం

విభాగాల వారీగా వివరాలు ఇచ్చిన అధికారులు

వరదల ధాటికి జిల్లాలో జరిగిన నష్టానికి సంబంధించి విభాగాల వారీగా అంచనాలను అధికారులు కేంద్ర బృందానికి సమర్పించారు. దీనిలో భాగంగా వ్యవసాయ, ఉద్యాన పంటలకు రూ.583 కోట్ల వరకు నష్టం జరిగినట్లు తెలిపారు. 32,771 మంది రైతులకు సంబంధించి 86,659 ఎకరాలు దెబ్బతినగా, 8,468 మంది రైతులకు చెందిన 11,537 ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు తెలిపారు. గృహాలకు సంబంధించి 7,943 నీట మునిగాయని వీటికి వాటిల్లిన నష్టం రూ.9.52 కోట్లుగా అంచనా వేశారు. 202 కిలోమీటర్ల మేర పంచాయతీరాజ్ రహదారులు దెబ్బతినగా 96.23 కోట్ల నష్టం వాటిల్లిగా, 191 కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రోడ్లు ఛిద్రమయ్యాయని శాశ్వత నిర్మాణం కోసం రూ.382.54 కోట్లు ఖర్చు కాగలదని నివేదికలో పొందుపర్చారు. విద్యుత్ శాఖకు రూ.1.17 కోట్లు, ఆక్వా రంగానికి రూ.10.17 కోట్లు, పాఠశాల భవనాలకు రూ.3.83 కోట్లు నష్టం వాటిల్లిందని కేంద్ర బృందానికి అందించిన నివేదికలో పేర్కొన్నారు. వరదల ధాటికి 24 లంకగ్రామాల్లోని 30,000 మంది ప్రజలు బాధితులుగా మారారని చెప్పారు.



చెరుకుపల్లి : కనగాల సమీపంలో మునిగిన వరి పొలాల మ్యాప్‌ను కేంద్ర బృందంకు వివరిస్తున్న కలెక్టర్

నేడు గుంటూరు జిల్లాలో..

గుంటూరు(ఆంధ్రజ్యోతి): కేంద్ర అంతర్ మంత్రిత్వ బృందం గురువారం వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించనున్నది. వ్యవసాయ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ వాగ్‌మరే(నాగ్‌పూర్), ఆర్థిక శాఖ కన్సల్‌టెంట్ కౌల్(ఢిల్లీ), గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ సెక్రెటరి ప్రదీప్‌కుమార్(ఢిల్లీ)లో కూడిన త్రిసభ్య బృందం వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించనుంది. ఉదయం 9 గంటలకు కలెక్టర్ నాగలక్ష్మి కలెక్టరేట్‌లోని శంకరన్ కాన్ఫరెన్స్ హాల్‌లో కేంద్ర బృందానికి ఫొటో ఎగ్జిబిషన్, పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా నష్టాన్ని వివరిస్తారు. అనంతరం పెదకాకాని పరిధిలోని గుంటూరు ఛానల్‌కు పడిన గండ్లను బృంద సభ్యులు పరిశీలిస్తారు. వెంకటకృష్ణాపురం, దేవరాయబొట్లపాలెంలో దెబ్బతిన్న పంటలు, మంగళగిరిలో దింపుడుకళ్లం చేనేతల ప్రాంతంలో నీటమునిగిన మగ్గాలను పరిశీలిస్తారు. తాడేపల్లి మండలం మహానాడులో, తుళ్లూరు మండలం వెంకటపాలెంలో వరద బాధిత కుటుంబాలను పరామర్శిస్తారు. కాగా గతంలో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు కేంద్ర బృందాలు వెంటనే వచ్చేవి కాదు. నెల తర్వాత వచ్చి పరిశీలించేవి. అప్పుడు క్షేత్రస్థాయిలో జరిగిన నష్టాన్ని అంతగా చూపెట్టలేకపోయేవారు. అయితే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మాత్రం కేవలం విపత్తు సంభవించిన 10 రోజుల్లోనే కేంద్ర బృందాన్ని పంపించింది. నేటికీ పెదకాకానితో పాటు అనేక మండలాల్లో పంట పొలాలు వరదనీటిలో మునిగే ఉన్నాయి. వాటిని చూపించడం ద్వారా వరద తీవ్రతని కేంద్ర బృందానికి నివేదిస్తామని అధికారవర్గాలు తెలిపాయి.



సమీక్షలో ఆయా శాఖల అధికారులను ప్రశ్నిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

లైసెన్సు లేకుండానే.. వ్యాపారాలు

- మిర్చియార్డులో అక్రమాలను గుర్తించిన విజిలెన్స్
- ప్రత్యక్ష విచారణలో వ్యాపారులు, వేమన్ల వాంగ్మూలాల నమోదు
- అక్రమాలను నేటి డీజీ సమావేశంలో నివేదించే అవకాశం



యార్డులో స్పాట్ ఎంక్వయిరీ నిర్వహిస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

గుంటూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): లైసెన్సులు లేకుండానే వ్యాపారం.. శాంపిల్ టిక్కీలకు రూ.10 చొప్పున అనధికారికంగా వసూళ్లు.. ఒక్కో ప్లాట్‌ఫాంపై రెండు బోర్డులు.. ఇలా గుంటూరు మిర్చియార్డులో అనేక అక్రమాలను విజిలెన్స్ అధికారులు గుర్తించారు. ఇప్పటికే వేల సంఖ్యలో ఫైళ్లను తీసుకెళ్లిన అధికారులు బుధవారం ఉదయం 6 గంటలకే యార్డుకు చేరుకుని దిగుమతి వ్యాపారులు, వేమన్లు, సూపర్‌వైజర్లను ప్రత్యక్షంగా విచారించారు. ఈ విచారణలో భాగంగా అనేక అక్రమాలను గుర్తించినట్లు తెలిసింది. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో మిర్చియార్డులో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ బృందం స్పాట్ ఎంక్వయిరీ నిర్వహించింది. టీడీపీ మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, మిర్చియార్డు మాజీ ఛైర్మన్ మన్నవ సుబ్బారావు గత నెలలో విజిలెన్స్ డైరెక్టర్ జనరల్‌కు చేసిన ఫిర్యాదు ఆధారంగా స్థానిక అధికారులు విచారణ చేపట్టారు. ఇప్పటికే యార్డు అధికారులతో మాట్లాడి అవసరమైన ఫైళ్లను కలెక్టరేట్ ప్రాంగణంలోని విజిలెన్స్ కార్యాలయానికి తీసుకెళ్లి పరిశీలిస్తున్నారు. తాజాగా బుధవారం విజిలెన్స్ సీఐ ఏ శ్రీహరిరావు, తహసీల్దారు కే నాగమల్లేశ్వరరావులతో కూడిన బృందం యార్డుకు చేరుకుని విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కొన్నేళ్లుగా రైతులు శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసుకుని అన్‌సీజన్‌లో విక్రయానికి తీసుకొస్తున్న శాంపిల్ టిక్కీలకు రూ.10 చొప్పున అనధికారికంగా వసూలు చేస్తున్నారని గుర్తించారు. రూ.లక్షల్లో అక్రమంగా వసూలు చేశారని నిర్ధారించుకున్నారు. మరోవైపు ఒక్కో కమిషన్ వ్యాపారికి కేటాయించే ప్లాట్‌ఫాంకు రెండు, మూడు ఫరంల బోర్డులుండటాన్ని గమనించారు. దీనిపై ఆరా తీయగా కొంతమంది లైసెన్సు కలిగిన కమీషన్ ఏజంట్లు వ్యాపారం చేయకుండా లీజుకు ఇచ్చి ఏటా రూ.5 లక్షల వరకు వసూలు చేస్తున్నారని తేలింది. అక్కడే ఉన్న వేమన్లను కూడా విచారించారు. కాటా వేస్తున్న చోట బిడ్డింగ్ బిల్లు, వేమెన్ చీటి పరిశీలించగా షాపు పేరుకు, చీటీలో నమోదు చేసిన పేరుకు పొంతన లేదు. లైసెన్సులు లేకుండా సుమారు 60 మంది వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించారు.

లైసెన్సుల రెన్యువల్‌లో అక్రమాల గుర్తింపు

2022లో ప్రభుత్వం జీవో 85ని తీసుకొచ్చి ఒక్కో కమీషన్ వ్యాపారి వద్ద రూ.5 లక్షల డిపాజిట్ చెల్లించుకుని లైసెన్సులు రెన్యువల్ చేయాల్సిందిగా ఆదేశించింది. అయితే ఏ కొద్దిమందో డిపాజిట్‌లు చెల్లించారు తప్ప మిగతా వారంతా హైకోర్టులో స్టే తెచ్చుకున్నారు. వీరందరి లైసెన్సులు రెన్యువల్ చేయడానికి రూ.50 వేల చొప్పున వసూలు చేసినట్లు కొంతమంది విజిలెన్స్ అధికారులకు ఉప్పందించారు. మరోవైపు మార్కెటింగ్ కమిషనర్ 64 ఫరంలకు సంబంధించి పార్టనర్‌షిప్ మార్పులను అనుమతించగా దానిని అడ్డం పెట్టుకుని అప్పటి పాలకులు 184 పార్టనర్‌షిప్‌లను మార్పు చేసేసి ఒక్కొక్కరి వద్ద రూ.లక్షల్లో అనధికారికంగా వసూలు చేసి వెనకేసుకున్నట్లు విజిలెన్స్ అధికారులు కొన్ని ఆధారాలను సేకరించారు. అలానే ఈ ఏడాది ఫిబ్రవరిలో మిర్చి యార్డులో గేట్ ఎంట్రీ అయిన సరుకుకు, కాటాలు జరిగిన టిక్కీలకు పొంతన లేకుండా ఉన్నట్లు తేలింది. దాదాపుగా 50 శాతం టిక్కీలు గల్లంతయ్యాయి. దీనిని బట్టి జీరో బిజినెస్ పెద్దఎత్తున జరిగినట్లు అనుమానిస్తున్నారు. ఎంత సరుకు అయితే జీరోలో వెళ్లిందో దాని రూపంలో మార్కెటింగ్‌కు 1 శాతం మార్కెట్ ఫీజు, వాణిజ్య పన్నుల శాఖకు 5 శాతం జీఎస్‌టీ నష్టం వాటిల్లింది. దీనంత టిపై సమగ్ర నివేదిక ని ప్రభుత్వానికి అందజేసేందుకు విజిలెన్స్ అధికారులు ఫైలు సిద్ధం చేస్తున్నారు. గురువారం విజిలెన్స్ డీజీ హరీష్ కుమార్ గుప్తా నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సమావేశంలో మిర్చియార్డు విచారణను కూడా నివేదించే అవకాశం ఉన్నది.



వివరాలు సేకరిస్తున్న నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

అయ్యో.. అరటి

- వరదలతో దెబ్బతిన్న తోటలు
- చెట్లపైనే పండి పోతున్న గెలలు
- రూ.1300 నుంచి రూ.600కు పడిపోయిన ధర



మార్కెట్ రూ.600 పలికిన అరటి గెలలు

కొల్లిపర, సెప్టెంబరు 11: ఉమ్మడి గుంటూరు జిల్లాలో అతి పెద్ద అరటి మార్కెట్‌గా ప్రసిద్ధి చెందిన కొల్లిపర మార్కెట్‌లో ప్రస్తుతం అరటి గెలలు ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. నిన్న మొన్నటి వరకు ఎన్నడూ లేనివిధంగా అరటి గెలల ధరలు పలకటంతో రైతులు ఆశ్చర్య పోయారు. సామాన్య ప్రజలు కూడా అరటి కాయలను కొనుగోలు చేయాలంటేనే భయపడిపోయారు. అటువంటిది అరటి ధరలు ఒక్కసారిగా పడిపోవడంతో రైతులు నిరుత్సాహపడుతున్నారు. వరదలు, వర్షాల కారణంగా నీరు నిల్వ ఉండటంతో తోటల్లోనే అరటి గెలలు పండిపోతున్నాయి. దీనికితోడు కృష్ణానది వరదకు లంకల్లో వేసిన అరటి తోటలు నీటిలో మునిగిపోయి బురద కొట్టుకుపోయాయి. దీంతో రుతువుకు రాకుండానే పండిపోతున్నాయి. రైతులకు అపారమైన నష్టం వాటిల్లుతుంది. పండిపోతుండటంతో గెలలు నరికి మార్కెట్‌కు తరలిస్తున్నారు. పడిన గెలలు మార్కెట్‌కు రావడంతో వ్యాపారులు వారికి ఇష్టం వచ్చినట్లు కొనుగోలు చేస్తున్నారు. అరటి పంట లేని సమయంలో ఆకాశాన్ని అంటిన ధరలు పంట వచ్చే సమయంలో పడిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

పది రోజుల క్రితం వరకు..

పది రోజుల క్రితం మొదటి రకం కర్పూర అరటి గెల ధర రూ.1000 నుంచి రూ.1350 వరకు, రెండో రకం రూ.700 నుంచి రూ.800 పలికాయి. మూడో రకం కర్పూర గెల రూ.350 నుంచి రూ.400, చక్కెర కేళి మొదటి రకం రూ.350 నుంచి రూ.450 వరకు ధర పలికింది. ఈ ధరలను చూసి రైతులు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. అటువంటిది ప్రస్తుతం మొదటి రకం అరటి గెల ధర రూ.600 నుంచి రూ.500, రెండో రకం రూ.400 నుంచి రూ.300 వరకు పలుకుతుంది. చక్కెరకేళి రూ.200 నుంచి రూ.250 వరకు ధర పలుకుతుంది. రూ.800 నుంచి రూ.500 వరకు ధర తగ్గడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. మహానంది, రావుపాలెం, ఏలూరు నుంచి ఎక్కువగా అరటి గెలలు దిగుమతి అయ్యే అవకాశం ఉందని, దీంతో ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని వ్యాపారులు తెలిపారు.



కొల్లిపర మార్కెట్‌లో గెలలను కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

డజను రూ.60 నుంచి రూ.80 విక్రయం

మార్కెట్‌లో అరటి గెలకు ధర తక్కువగా ఉన్నా వ్యాపారులు మాత్రం అధిక ధరకు అమ్ముతున్నారు. ప్రస్తుతం ఉన్న ధరను బట్టి డజను అరటి కాయలు రూ.20 నుంచి రూ.35 మాత్రమే పడుతున్నాయి. అటువంటిది వ్యాపారులు మాత్రం డజను అరటి కాయలను రూ.60 నుంచి రూ.80 వరకు అమ్మిసొమ్ము చేసుకుంటున్నారు. దీంతో అరటి కాయలను కొనాలంటేనే ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది. పండించిన రైతులు మాత్రం తీవ్రంగా నష్టపోతున్నారు.

పసికందును ఇచ్చేశారు

- తల్లి మృతి.. మరో తల్లి ఆవేదన తీర్చేందుకు..
- అప్పటికే 8 మంది సంతానంతో బిడ్డను ఇచ్చిన తండ్రి



సుబ్రమణ్యం ఇల్లు

చిన గంజాం, సెప్టెంబరు 11: సినీ ఫక్కీలో జరిగిన ఓ శిశువు వ్యవహారం కలకలం రేపింది. ఈ ఘటనపై గుంటూరు కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా చినగంజాంలో బుధవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు.. చినగంజాం పంచాయతీ పరిధిలోని జాలమ్మ కాలనీకి చెందిన మానికల సుబ్రమణ్యం భార్య లక్ష్మి చీరాల వైద్యశాలలో ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆమెను గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. భట్టిప్రోలుకు చెందిన మీరాబీ అనే గర్భిణి గత నెలాఖారున జీజీహెచ్‌లో ప్రసవించగా శిశువు మృతి చెందింది. దీంతో మానసిక వేదనతో మీరాబీ ఆరోగ్యం క్షీణించింది. జీజీహెచ్‌లోనే చికిత్స పొందుతున్న మీరాబీని చూసుకునేందుకు భట్టిప్రోలుకు చెందిన ఆమె స్నేహితురాలు ప్రభావతి.. మీరాబీ ప్రసవానికి ముందు నుంచే తోడుగా ఉంటుంది. బిడ్డను కోల్పోయిన మీరాబీ బాధను ప్రభావతి చూడలేకపోయింది. అదే సమయంలో జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నగంజాంకు చెందిన మానికల సుబ్రహ్మణ్యం భార్య లక్ష్మి ఆడ శిశువుకు జన్మనిచ్చిన తర్వాత కన్నుమూసింది. సుబ్రహ్మణ్యంకు అప్పటికే 9 మంది సంతానం ఉన్నారు. సుబ్రహ్మణ్యం భార్య చనిపోవడం, కొత్తగా పుట్టిన శిశువును పెంచడం వాళ్లకు ఇబ్బందిగా ఉంటుందని భావించిన ప్రభావతి.. ఈ నెల 7న చిన్నగంజాం వచ్చి సుబ్రహ్మణ్యాన్ని సంప్రదించి వారి శిశువును రూ.లక్షా 90 వేలకు కొనుగోలు చేసినట్లు ప్రచారం జరుగుతుంది. ఆ శిశువును మీరాబీకి ఇచ్చింది. అయితే మీరాబీకి పుట్టిన శిశువు చనిపోవడంతో మరో శిశువును తీసుకురావడంపై అనుమానం వచ్చిన ఆసుపత్రి సిబ్బంది ప్రభావతిని నిలదీశారు. దీంతో ఆ శిశువును కొనుగోలు చేసి తీసుకొచ్చినట్లు ఆమె ఒప్పుకొంది. సిబ్బంది విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మొత్తం వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారించిన ఆసుపత్రి వర్గాలు శిశువు కొనుగోలు వాస్తవమేనని గుర్తించారు. ఆసుపత్రి ఆర్‌ఎం ఫిర్యాదు మేరకు కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి కేసు నమోదు చేశారు. కొత్తపేట పోలీసులు పంపిన సమాచారం మేరకు కేసు విచారణ చేస్తున్నట్లు చినగంజాం ఎస్ఐ ఎస్.రమేష్ తెలిపారు. తల్లి లేని బిడ్డను సాక లేక వారికి ఇచ్చినట్లు సుబ్రమణ్యం బంధువులు తెలిపారు. సుబ్రమణ్యం స్వగ్రామం చినగంజాం అయినప్పటికీ అతడు నాగులుప్పలపాడు మండలం నిడమానూరులో ఉంటున్నాడు.

కట్టెలు కొట్టుకుంటూ పోషణ



కట్టెలు, చేపలు అమ్మగా వచ్చిన సంపాదనతో ఎనిమిది మంది పిల్లలను పోషించుకుంటున్నాం. బిడ్డ చనిపోయి బాధనడుతున్న మరో తల్లికి బిడ్డ లేని లోపం లేకుండా చేసేందుకు ఇచ్చాం. బిడ్డను అమ్ముకోలేదు. పెంచుకునేందుకు ఇచ్చాం. అక్కడైనా బిడ్డ సుఖంగా ఉంటుందని ఇచ్చాం.

- చేవూరి శ్రీలక్ష్మి, సుబ్రమణ్యం చెల్లి

అందరికీ రిలేట్ అవుతుంది

'బెంచ్ లైఫ్' వెబ్ సిరీస్‌తో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు మానస శర్మ. తమిళ నటుడు వైభవ్, చరన్ పెరి, రాజేంద్ర ప్రసాద్, రితికా సింగ్, అకాంక్ష సింగ్ ప్రధాన పాత్రలు పోషించారు. నిహారిక కొణిదెల నిర్మించారు. ఈ శుక్రవారం ఓటీటీ సంస్థ 'సోనీ లైవ్'లో విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది.



నిర్మాత నిహారిక కొణిదెల మాట్లాడుతూ "ఇది కార్పోరేట్ ఉద్యోగుల కథ అయినా.. అందరికీ రిలేట్ అవుతుంది. వినోదంతో పాటు.. మంచి భావోద్వేగాలు ఇందులో ఉంటాయి. అద్భుతమైన కంటెంట్ ఉన్న ఈ వెబ్ సిరీస్ తప్పకుండా అందరికీ నచ్చుతుంది" అని చెప్పారు. దర్శకురాలు మానస శర్మ మాట్లాడుతూ "నేను జాబ్ చేస్తున్నప్పుడు ఎదురైన అనుభవాలు.. లైఫ్‌లో చూసిన అనేక సంఘటనలను స్ఫూర్తిగా తీసుకొని తెరకెక్కించిన వెబ్ సిరీస్ ఇది. ప్రతీ పాత్రకూ ఓ కథ ఉంటుంది. ఇందులోని నటీనటులు పంచే వినోదం చాలా కాలం గుర్తుంటుంది" అని చెప్పారు. నటుడు చరణ్ పెరి మాట్లాడుతూ "స్నేహ మాధుర్యాన్ని.. అభిరుచులను సరికొత్తగా ఆవిష్కరించే సిరీస్ ఇది" అని అన్నారు.

విడాకుల విషయం నాకు తెలియదు



ఆర్తి రవి

తనకు తెలియకుండా, తన సమ్మతి లేకుండా తన భర్త విడాకుల ప్రకటన చేశారంటూ ఆర్తి రవి బుధవారం ప్రకటన విడుదల చేయడంతో తమిళ హీరో జయం రవి విడాకుల వ్యవహారం సరికొత్త మలుపు తిరిగింది. ఈ విషయంపై ఆమె విడుదల చేసిన ప్రకటనలో.. 'మా వైవాహిక జీవితం గురించి మీడియా, సోషల్ మీడియాలో వస్తున్న కథనాలు చూసి ఆందోళనకు గురయ్యాను. 18 ఏళ్ళుగా పరస్పర విశ్వాసం, గౌరవంతో కుటుంబ జీవితాన్ని గడుపుతున్నాం. ఈ విడాకుల ప్రకటన వల్ల మా గౌరవ మర్యాదలతో పాటు వ్యక్తిత్వాన్ని కోల్పోయినట్టుగా భావిస్తున్నాను. నా భర్తతో మాట్లాడాలని, కలవాలని ఎన్నో సార్లు ప్రయత్నం చేశాను. కానీ, నాకు అలాంటి అవకాశం దక్కలేదు. నేను, నా పిల్లలు ఇబ్బంది పడుతున్నాం. వైవాహిక బంధం నుంచి వైదొలగాలనే ఈ నిర్ణయం పూర్తిగా ఆయన సొంతంగా తీసుకున్నది. దీనిపై బహిరంగంగా వ్యాఖ్యానించదలచుకోలేదు. అయితే, నా వ్యక్తిత్వానికి కళంకం కలిగించేలా బహిరంగంగా జరుగుతున్న ప్రచార దాడులను సహించలేకపోతున్నాను. ఈ అసత్య ప్రచారాన్ని తిరస్కరించడం నా తొలి కర్తవ్యం' అని ఆర్తి రవి పేర్కొన్నారు.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)



భారీ వర్షాలు, వరదలతో ఇబ్బంది పడుతున్న ప్రజలను ఆదుకోవడానికి రెండు తెలుగు రాష్ట్రాల సీఎం రిలీఫ్ ఫండ్‌కు కలిపి హీరో సాయిదుర్గ తేజ్ రూ. 20 లక్షలు విరాళం ప్రకటించిన సంగతి తెలిసిందే. బుధవారం ఏపీ మంత్రి నారా లోకేశ్‌కు రూ. పది లక్షల చెక్కును విజయవాడలో అందించారు సాయి దుర్గ తేజ్. అలాగే అమ్మ అనాథాశ్రమానికి రూ. రెండు లక్షలు, ఇతర సేవా సంస్థలకు రూ. మూడు లక్షలు విరాళంగా అందించారు

సాహసనారి సంయుక్త



నిఖిల్ కథానాయకుడిగా భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'స్వయంభూ'. పీరియాడిక్ వార్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో నిఖిల్‌కు జోడీగా నభానటేష్, సంయుక్త నటిస్తున్నారు. బుధవారం సంయుక్త పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం ఆమె ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. యుద్ధ భూమిలో విల్లును ఎక్కుపెడుతున్న యోధురాలిగా ఆమె లుక్ అలరించింది. భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. అలాగే శర్వానంద్ సరసన సంయుక్త హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం (శర్వా 37-వర్కింగ్ టైటిల్) నుంచి ఆమె పాత్రను పరిచయం చేస్తూ ప్రత్యేక లుక్‌ను యూనిట్ విడుదల చేసింది. ఈ చిత్రంలో దియా అనే పాత్రలో ఆమె కనిపించనున్నారు. రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్నారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రంలోనూ సంయుక్త హీరోయిన్‌గా నటిస్తున్నారు. మహేశ్ చందు నిర్మాత. సమీరా అనే పాత్రలో సంయుక్త నటిస్తున్నారు. ఆమె పుట్టిన రోజు సందర్భంగా యూనిట్ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది.

మలైకా ఇంట విషాదం



బాలీవుడ్ నటి మలైకా అరోరా ఇంట్లో విషాద ఘటన జరిగింది. మలైకా సవతి తండ్రి అనిల్ మెహతా ముంబైలో ఆరు అంతస్థుల భవంతి నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని.. ఆయనను ఆస్పత్రిలో చేర్పించారు. కానీ అప్పటికే ఆయన చనిపోయారని వైద్యులు తెలిపారు. అయితే అనిల్ మెహతాది ఆత్మహత్య కాదా అనే విషయం అధికారికంగా తెలియాల్సి ఉంది.

ఉన్నత విద్యలో ఇక ఒకే విధానం

- **అన్ని యూనివర్సిటీలు, కాలేజీలకు వర్తింపు**
- **2024-25 అకడమిక్ క్యాలెండర్ విడుదల**

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యలో ఏకరూప విధానాన్ని అమలు చేసేందుకు ఉన్నత విద్యాశాఖ చర్యలు ప్రారంభించింది. డిగ్రీ, బీటెక్, ఫార్మసీ కోర్సులకు ఉన్నత విద్యాశాఖ 2024-25 అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. ఏటా అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేస్తున్నా యూనివర్సిటీలు దాన్ని అమలుచేయడం లేదు. ఒక్కో యూనివర్సిటీ ఒక్కోలా పరీక్షలు నిర్వహించుకుంటున్నాయి. ఇకపై అన్ని వర్సిటీలు ఒకే విధానాన్ని అమలుచేయాలని ప్రభుత్వం స్పష్టంచేసింది. అకడమిక్ క్యాలెండర్ ప్రకారమే బోధన, పరీక్షలు నిర్వహించాలని ఆదేశించింది.

డిగ్రీ కోర్సులకు ఇలా..

అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సాధారణ డిగ్రీ కోర్సుల సెమిస్టర్-1 తరగతులు ఆగస్టు 12న ప్రారంభమవుతాయి. డిసెంబరు 9 నుంచి 21 వరకు పరీక్షలు జరుగుతాయి. జనవరి 10న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-2 డిసెంబరు 23న ప్రారంభమవుతుంది. ఏప్రిల్ 21 నుంచి మే 3 వరకు పరీక్షలు జరుగుతాయి. మే, జూన్ నెలల్లో ఎనిమిది వారాల కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టు ఉంటుంది. మే 24న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-3 జూలై 8న ప్రారంభమవుతుంది. నవంబరు 11 నుంచి 23 వరకు పరీక్షలు జరుగుతాయి. డిసెంబరు 13న ఫలితాలు ప్రకటిస్తారు. సెమిస్టర్-4 నవంబరు 25న ప్రారంభవుతుంది. ఏప్రిల్ 21 నుంచి జూన్ 14 వరకు పరీక్షలు జరుగుతాయి. ఏప్రిల్, జూన్ నెలల్లో ఎనిమిది వారాల షార్ట్ టర్మ్ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. సెమిస్టర్-5 జూలై 8న ప్రారంభమవుతుంది. నవంబరు 11 నుంచి 23 వరకు పరీక్షలు జరుగుతాయి. డిసెంబరు 13న ఫలితాలు ప్రకటిస్తారు. సెమిస్టర్-6 నవంబరు 25న ప్రారంభమవుతుంది. మార్చి 24 నుంచి ఏప్రిల్ 5 వరకు పరీక్షలు జరుగుతాయి. ఏప్రిల్ 26న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-7 జూలై 1న ప్రారంభమవుతుంది. నవంబరు 4 నుంచి 16 వరకు పరీక్షలు జరుగుతాయి. డిసెంబరు 7న ఫలితాలు ప్రకటిస్తారు. సెమిస్టర్-8 నవంబరు 18న ప్రారంభమవుతుంది. మార్చి 24 నుంచి ఏప్రిల్ 5 వరకు పరీక్షలు జరుగుతాయి. ఏప్రిల్ 26న ఫలితాలు విడుదల చేస్తారు.

బీటెక్‌కు ఇలా..

ఇంజనీరింగ్ సెమిస్టర్-1 తరగతులు ఆగస్టు 1న ప్రారంభమవుతాయి. డిసెంబరు 16 నుంచి జనవరి 4 వరకు పరీక్షలు జరుగుతాయి. జనవరి 25న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-2 జనవరి 6న ప్రారంభమవుతుంది. జూన్ 2 నుంచి 21 వరకు పరీక్షలు జరుగుతాయి. జూలై 11న ఫలితాలు ప్రకటిస్తారు. సెమిస్టర్-3 జూలై 8న ప్రారంభమవుతుంది. నవంబరు 11 నుంచి 30 వరకు పరీక్షలు జరుగుతాయి. డిసెంబరు 21న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-4 డిసెంబరు 2న ప్రారంభమవుతుంది. ఏప్రిల్ 7 నుంచి 26 వరకు పరీక్షలు జరుగుతాయి. మే 17న ఫలితాలు ప్రకటిస్తారు. ఏప్రిల్, జూన్ నెలల్లో 8 వారాల కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టు ఉంటుంది. సెమిస్టర్-5 జూలై 8న ప్రారంభమవుతుంది. నవంబరు 11 నుంచి 30 వరకు పరీక్షలు జరుగుతాయి. డిసెంబరు 21న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-6 డిసెంబర్ 2న ప్రారంభమవుతుంది. ఏప్రిల్ 7 నుంచి 26 వరకు పరీక్షలు జరుగుతాయి. 8వారాల షార్ట్ టర్మ్ ఇన్‌టర్న్‌షిప్ ఉంటుంది. మే 17న ఫలితాలు ప్రకటిస్తారు. సెమిస్టర్-7 జూలై 29న ప్రారంభమై.. నవంబరు 25 నుంచి డిసెంబరు 14 వరకు పరీక్షలుంటాయి. జనవరి 4న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-8 డిసెంబరు 16న ప్రారంభమై.. ఏప్రిల్ 15 నుంచి 19 వరకు పరీక్షలు జరుగుతాయి. ఏప్రిల్ 26న ఫలితాలు ప్రకటిస్తారు.

డిగ్రీ అడ్మిషన్ల షెడ్యూల్ మార్పు

మూడో విడత డిగ్రీ అడ్మిషన్లకు ఇటీవల విడుదల చేసిన షెడ్యూల్‌ను ఉన్నత విద్యామండలి సవరించింది. రిజిస్ట్రేషన్ గడువును ఈనెల 15వ తేదీ వరకు పొడిగించింది. 11 నుంచి 18 వరకు విద్యార్థులు ఆప్షన్లు ఎంపిక చేసుకోవచ్చని, 19న ఆప్షన్ల మార్పునకు అవకాశం ఉంటుందని తెలిపింది. 22న సీట్ల కేటాయింపు జరుగుతుందని, 22 నుంచి 25లోగా విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టు చేయాలని పేర్కొంది.

జెత్వానీ మొబైల్ ఫోన్ ఎక్కడ?

- **వివరాలు తమ ముందుంచాలని పోలీసులకు హైకోర్టు ఆదేశం**

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సినీనటి కాదంబరి జెత్వానీ నుంచి సీజ్ చేసిన మొబైల్ ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలు ప్రస్తుతం ఎక్కడ ఉన్నాయో చెప్పాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. వాటిని భద్రపరిచేందుకు తీసుకున్న చర్యలను తెలపాలని కోరింది. ఎలక్ట్రానిక్ పరికరాలను భద్రపరచాలని పోలీసులను ఆదేశిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. విద్యాసాగర్ దాఖలు చేసిన వ్యాజ్యంలో ప్రతివాదిగా చేర్చుకొని తన వాదనలు వినిపించేందుకు అనుమతించాలంటూ కాదంబరి దాఖలు చేసిన ఇంప్లీడ్ పిటిషన్‌ను హైకోర్టు అనుమతించింది. విచారణను ఈ నెల 17కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టీవీఎల్ఎన్ చక్రవర్తి బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. జెత్వానీ నుంచి పోలీసులు సీజ్ చేసిన పరికరాలను నిందితురాలికి వెనక్కి ఇవ్వకుండా ఆదేశించాలని కోరుతూ ఉమ్మడి కృష్ణాజిల్లా, కోసూరుకు చెందిన కేవీఆర్ విద్యాసాగర్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు రాగా పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది టి.నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. జెత్వానీ తరఫు న్యాయవాది నర్రా శ్రీనివాస్.. వ్యాజ్యంలో ఇంప్లీడ్ అయి వాదనలు వినిపించేందుకు అనమతించాలని కోరారు.

రహదారుల భద్రతపై హైకోర్టులో పిల్

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రహదారుల భద్రత, నిర్వహణ విషయంలో సుప్రీంకోర్టు కమిటీ ఇచ్చిన మార్గదర్శకాలను రాష్ట్రంలో అమలు చేయట్లేదంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యం(పిల్)పై హైకోర్టు స్పందించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులుగా ఉన్న కేంద్ర రవాణాశాఖ కార్యదర్శి, ఏపీ ప్రభుత్వ సీఎస్, రవాణాశాఖ కార్యదర్శి, పురపాలకశాఖ ప్రత్యేకప్రధాన కార్యదర్శి, రహదారుల అభివృద్ధి సంస్థ చీఫ్ ఇంజనీర్, రవాణాశాఖ కమిషనర్, డీజీపీ తదితరులకు నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది.

వరద బాధితులకు ఆపన్నహస్తం

కోటి ఇచ్చిన డిక్సన్, జీవీపీఆర్ ఇంజనీర్స్, నెక్కంటి సీ ఫుడ్స్, సంధ్య ఆక్వా

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వరద బాధితుల సహాయార్థం దాతలు స్పందించి, ముఖ్యమంత్రి సహాయ నిధికి తమవంతు విరాళాలు అందజేస్తున్నారు. బుధవారం సాయంత్రం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలసి పలువురు విరాళాల చెక్కులు అందజేశారు. సంధ్యా మెరైన్స్ కేవీ ప్రసాద్ రూ.కోటి, జీవీపీఆర్ ఇంజనీర్స్ లిమిటెడ్ ఛైర్మన్ జీఎస్‌పీ వీరారెడ్డి, ఎండీ శేఖర్‌రెడ్డి రూ.కోటి, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఛైర్మన్ సత్యప్రకాష్‌సింగ్ రూ.86 లక్షలు, వైశాఖి ఫౌండేషన్ ఎల్లంకి రవికుమార్ రూ.50 లక్షలు, దర్శి నియోజకవర్గ ప్రజల తరఫున రూ.37,16,200, మోడల్ డైరీ ఎండీ పీ ధనప్రకాష్ రూ.30 లక్షలు, నార్త్ అమెరికా కమ్మ సంఘం రూ.30 లక్షలు, దర్శి నియోజకవర్గ టీడీపీ మహిళా నేత గొట్టిపాటి లక్ష్మీ రూ.10 లక్షలు, మణిపాల్ హాస్పటల్స్ క్లస్టర్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి, అసోసియేట్ డైరెక్టర్ జే రామాంజనేయరెడ్డి రూ.25 లక్షలు, ఆఫ్రికా, కెన్యా టీడీపీ తరఫున బొబ్బా శివప్రకాష్ రూ.20 లక్షలు, ది సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ రాజు, ఎండీ కేవీ సుబ్బయ్య రూ.10 లక్షలు, గుంటూరు డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రూ.1,84,500 సీఎంకు అందజేశారు. కాగా, అమరావతి సచివాలయంలో.. డిక్సన్ గ్రూప్ కంపెనీ ప్రతినిధులు రూ.కోటి, నెక్కంటి సీ ఫుడ్స్ యాజమాన్యం రూ.కోటి, సంధ్య ఆక్వా రూ.కోటి చెక్కును మంత్రి లోకేశ్‌ని కలసి అందజేశారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రూ.25 లక్షలు, రేస్ పవర్ సంజయ్‌గుప్తా రూ.25 లక్షలు, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కర్నూలుకు చెందిన డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి రూ.11 లక్షలు, సినీ హీరో సాయి ధరమ్ తేజ్ రూ.10 లక్షలు అందజేశారు. కాగా, మంత్రి టీజీ భరత్ విజయవాడలోని ఊర్మిళా నగర్‌లో వరద బాధితులకు నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు.

జాతీయ ప్రదర్శనకు ఎంపిక

పెదకాకాని, సెప్టెంబరు 11: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఫైన్ ఆర్ట్స్ విభాగంలో చివరి సంవత్సరం విద్యార్థి సోను దాస్ క్యామెల్ కంపెనీ నిర్వహిస్తున్న జాతీయ క్యాంప్, చిత్ర ప్రదర్శనలో పాల్గొనేందుకు ఎంపికయ్యాడు. కర్ణాటక, హంపిలో నవంబర్ 25 నుంచి 29 వరకూ ఈ క్యాంప్ ఐదు రోజులపాటు జరగనుంది. ఈ క్యాంప్‌లో ఎంపికైన వర్ణచిత్రాలు వచ్చే ఏడాది జనవరిలో ముంబాయి జహంగిర్ ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శిస్తారు. నాగార్జున విశ్వవిద్యాలయ ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ఆచార్య గంగాధరరావు విద్యార్థిని అభినందించారు. ఫైన్ ఆర్ట్స్ విభాగం అసిస్టెంట్ కోఆర్డినేటర్ బి.శేఖర్ బాబు, అధ్యాపకులు పి.దేవకాంత్ పాల్గొన్నారు.

వినాయక విగ్రహానికి పూజలు

పెదకాకాని, సెప్టెంబరు 11: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన వినాయక చవితి వేడుకల్లో భాగంగా బుధవారం ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.గంగాధరరావు వినాయక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ కుటుంబానికి క్షేమం జరగాలని, అభివృద్ధి మరింత రెట్టింపు అవ్వాలని, అందరికీ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరారు. కార్యక్రమంలో ఆచార్య వి.వెంకటేశ్వర్లు, ఆచార్య ఎల్.జయశ్రీ, డాక్టర్ ఎం.వి.రమణ, డాక్టర్ శ్రీకృష్ణ, విద్యార్థి సంఘాల నాయకులు అభిషేక్, హేమంత్ పాల్గొన్నారు.

జోగులాంబ హాల్ట్‌లో రైళ్ల నిలుపుదల ఎత్తివేత

గుంటూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్లాట్‌ఫాం పనుల కారణంగా వారంపాటు శ్రీబాల బ్రహ్మేశ్వర జోగులాంబ రైల్వేస్టేషన్‌లో రైళ్ల నిలుపుదల ఎత్తి వేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఏ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు నంబరు. 17252 కాచీగూడ - గుంటూరు, 17251 గుంటూరు - కాచీగూడ, 17254 ఔరంగబాద్ - గుంటూరు, 17253 గుంటూరు - ఔరంగబాద్ రైళ్లకు నిలుపుదల ఎత్తి వేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

నందిగం సురేష్ పోలీస్ కస్టడీపై ముగిసిన విచారణ

మంగళగిరి, సెప్టెంబరు 11: వైసీపీ నాయకుడు, బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను పోలీసు కస్టడీకి ఇవ్వాలని మంగళగిరి రూరల్ పోలీసులు వేసిన పిటీషన్‌పై మంగళగిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బుధవారం వాదనలు జరిగాయి. వాదనలు పూర్తి కాగా ఈ నెల 13న తీర్పు వెలువరిస్తామని న్యాయమూర్తి సురేష్‌బాబు చెప్పారు. ఇదిలా ఉండగా టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను ఈ నెల 5న మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. కాగా సురేష్ విచారణకు సహకరించకపోవడంతో పోలీసు కస్టడీకి 8 రోజులు ఇవ్వాలని రూరల్ పోలీసులు కోర్టును ఆశ్రయించారు.

ద్విచక్ర వాహనం పైనుంచి జారి మహిళ మృతి

నాదెండ్ల, సెప్టెంబరు 11: ద్విచక్ర వాహనం పైనుంచి జారి పడగా బొక్కా కుమారి(33) అనే మహిళ బుధవారం మృతి చెందింది. కారంపూడి మండలం పేటసన్నిగండ్ల గ్రామానికి చెందిన బొక్కా ఇస్సాక్, కుమారి దంపతులు కొద్దికాలం నుంచి గుంటూరులో ఉంటూ కూలి పనులు చేసుకొని జీవిస్తున్నారు. కుమారి మామకు ఆరోగ్యం బాగా లేకపోవటంతో ఆయన నరసరావుపేటలోని ఒక వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఆయన్ను చూసేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చి గుంటూరు వెళ్తుండగా సాతులూరు గ్రామ పరిధిలోని స్పీడు బ్రేకర్ వద్ద వెనుక కూర్చున్న కుమారి జారి కింద పడింది. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయం కావటంతో నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందిందని వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిరాడంబరంగా విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవ

పెదకాకాని, సెప్టెంబరు 11: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవం బుధవారం నిరాడంబరంగా జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.గంగాధరరావు మాట్లాడుతూ 1976లో అప్పటి రాష్ట్రపతి ఫకృద్దీన్ అలీ అహ్మద్ చేతుల మీదుగా ప్రారంభమైన ఈ విశ్వవిద్యాలయం దినదినాభివృద్ధి చెందుతూ నేడు కొన్ని లక్షల మందికి డిగ్రీలను, కొన్ని వేల మందికి డాక్టరేట్ పట్టాలను అందించి రాష్ట్రస్థాయితోపాటు జాతీయంగానూ తన ఉనికిని చాటుకుందని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ అభివృద్ధిలో అధికారులు, అధ్యాపకులు, ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు వారి వారి శక్తి మేర కృషిచేసి విశ్వవిద్యాలయ ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్నందుకు అందరినీ అభినందించారు. విశ్వవిద్యాలయ పురోగతి నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంలో ఆచార్య నాగార్జున విగ్రహానికి పూలమాలలు వేశారు. ఇన్చార్జి రెక్టర్ ఆచార్య కె.రత్న షీలామణి, ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ప్రిన్సిపాల్స్ ఆచార్య సీహెచ్ స్వరూపారాణి, ఆచార్య కె.వీరయ్య, ఆచార్య ప్రమీలరాణి పాల్గొన్నారు.

నిక్షిప్తమైతే.. నిజాలు తెలుస్తాయేమో!



- పీఏసీఎస్ కంప్యూటరీకరణపై అక్రమార్కుల గుండెల్లో గుబులు
- బోగస్, బినామీ రుణాలు వెలుగులోకి వచ్చే అవకాశం

గుంటూరు సిటీ, సెప్టెంబరు 11: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో (పీఏసీఎస్) జరుగుతున్న అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం నడుంబిగించింది. జిల్లా లోని సహకార సంఘాల రికార్డులన్నీ కంప్యూటరీకరణ చేయాలని ఆదేశించింది. అక్టోబర్ 2 నాటికి అన్ని సహకార సంఘాల్లోని రికార్డులన్నింటినీ కంప్యూటర్‌లో నిక్షిప్తం చేయాలని గడువు విధించారు. జిల్లాలోని 63 సహకార సంఘాల్లో ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభం అయింది. ప్రభుత్వం విధించిన గడువులోగా కంప్యూటరీకరణ పూర్తి చేయించేందుకు జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ సహకార శాఖ అధికారులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. అయితే సహకార శాఖలోని కొందరు మాత్రం రికార్డుల కంప్యూటరీకరణ కు పెద్దగా ఆసక్తి చూపటం లేదు. ఇప్పటి వరకు జరిగిన లావాదేవీలు కంప్యూటర్లోకి ఎక్కితే బోగస్, బినామీ రుణాలు బయటకు వస్తాయన్న ఆలోచనతో చాలామంది ఉన్నట్లు తెలుస్తోంది.

ఉచ్చు బిగిసినట్లే..

వ్యవసాయ పరపతి సంఘాలను అడ్డుపెట్టుకుని చాలా మంది రాజకీయ నాయకులు, అధికారులు, సిబ్బంది అనేక అక్రమాలకు పాల్పడ్డారు. రైతుకు కనీస సమాచారం లేకుండానే వారి పేర్లతో రూ.కోట్లలో రుణాలు పొందారు. ప్రతి ఏడాది ఆ రుణాలను రీషెడ్యూల్ చేస్తున్నారే తప్పా పూర్తిగా చెల్లించటం లేదు. రికార్డుల్లో మాత్రం రుణం పూర్తిగా చెల్లించినట్లు, మళ్లీ కొత్త రుణం మంజూరు చేసినట్లు ఉంటుంది. ఇటువంటి విధానం గత కొన్నేళ్లుగా ఆనవాయితీగా కొనసాగుతూ వస్తుంది. ఇదిగాక కొన్ని వేలమంది ఆయా సహకార సంఘాల్లో సభ్యులుగా ఉంటే కొద్దిమందికి మాత్రమే రుణాలు ఇస్తున్నారు.

కేవలం 550 మందికి ఏటా పంట రుణాలు

ఉదాహరణకు ఫిరంగిపురం వ్యవసాయ పరపతి సంఘంలో 24 వేల మంది సభ్యులు ఉంటే అందులో కేవలం 550 మందికి ఏటా పంట రుణాలు మంజూరు చేస్తున్నారు. ఇలా చాలా సంఘాల్లో ఇటువంటి వ్యవహారాలు జరుతున్నాయి. పార్టీ ఏదైనా సొసైటీ అధ్యక్షుడుగా వస్తున్న వ్యక్తులు ఎంతోకొంత అవినీతి, అక్రమాలకు పాల్పడి వ్యవసాయ పరపతి సంఘాలను దోచుకున్నట్టు శాఖ అంతర్గత ఆడిట్‌లో బహిర్గతం అవుతుంది. సహకార సంఘాల రికార్డులన్నీ చేవ్రాతతో ఉండటంతో ఇటువంటి అక్రమాలకు అవకాశం ఉంటుంది. దాన్ని నివారించేందుకు కూటమి ప్రభుత్వం సహకార సంఘాల కంప్యూటరీకరణను తెరపైకి తెచ్చింది. ఇది జరిగితే గత కొన్నేళ్లుగా సొసైటీల్లో జరిగిన అక్రమాలు వెలుగులోకి రావటంతోపాటు, భవిష్యత్‌లో అటువంటి వాటికి అవకాశం ఉండదని సహకార శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు.

అమరావతిపై దుష్ప్రచారం వద్దు



ఉద్దండ్రాయునిపాలెం లంక వాసులకు నిత్యవసర సరకులను అందిజేస్తున్న మాజీ మంత్రి, టీడీపీ నేత డొక్కా మాణిక్య వరప్రసాద్

- వర్షం పడితే ఎక్కడైనా నీళ్లు వస్తాయి
- జగన్‌రెడ్డిని జైల్ టూరిజం అంబాసిడర్‌గా పెట్టాలి
- మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్

తుళ్లూరు, సెప్టెంబరు 11: అమరావతి ముంపు అని వైసీపీ వారు ప్రచారం చేయవద్దని, దానిని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి, టీడీపీ నేత డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. బుధవారం తాళ్ళాయపాలెం, ఉద్దండ్రాయునిపాలెం లంకల్లో డొక్కా పర్యటించి వరద బాధితులను పరామర్శించి పులి సుధాకర్ మోమోరియల్ ద్వారా ఏర్పాటు చేసన నిత్యవసర సరలను 160 కుటుంబాలకు ఆయన అందజేశారు. తుళ్లూరు మండలంలో లంక ప్రాంతం నివాసులకు వరద వల్ల ప్రతి సారి నష్టం కలుగుతుందన్నారు. ప్రభుత్వంతో మాట్లాడి లంక వాసులకు శాశ్వత గృహ కల్పన, భృతి ఏర్పాటు అయ్యేలా చేస్తామన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో డొక్కా మాట్లాడుతూ వర్షం పడితే ఎక్కడైనా నీళ్లు వస్తాయన్నారు. గుంటూరుకు వరద నీరు వచ్చిందన్నారు. విజయవాడ బుడమేరు వరద వస్తే 175 నియోజకవర్గాల్లో పోటి చేసిన వారంతా ఏమైపోయారో తెలియటం లేదన్నారు. జగన్‌రెడ్డి హింసను ప్రోత్సహిస్తున్నారన్నారు. అధికారం పోతే అంతు తేలుస్తానని అనటం ప్రజాస్వామ్యాన్ని కాలరాయటమేనన్నారు. ప్రజలకు జగన్‌రెడ్డి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నాడని ప్రశ్నించారు. మళ్లీ అధికారంలోకి వస్తే అక్రమ కేసులుపెడతానని జగన్‌రెడ్డి అనటం చూసి టెర్రరిస్టులు కూడా.. మేము అధికారంలోకి వస్తామంటారన్నారు. ఇలా మాట్లాడితే హింసను ప్రేరేపిస్తున్నారని వైసీపీని ఎన్నికల కమిషన్ రద్దు చేస్తుందన్నారు. హిస్టారికల్ , బుద్ధిస్ట్ టూరిజంలకు బ్రాడ్ అంబాసిడర్‌లను ఏర్పాటు చేసిన మాదిరిగా డార్క్ జైలు టూరిజం ఏర్పాటు చేసి దాని అంబాసిడర్‌గా జగన్‌రెడ్డిని పెట్టాలని కోరుకుంటున్నాని డొక్కా అన్నారు. బ్యారేజీని బోటులు గుద్దుకోవటం వెనక కుట్ర కోణం దాగి ఉంటే ఎంతటి వారైనా చట్టం వదిలిపెట్టదని హెచ్చరించారు.

వరద బాధితులకు రూ. 50 లక్షల విరాళం

- సంగం చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్ (చేబ్రోలు) సెప్టెంబరు11: వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి సంగం డెయిరీ రూ.50 లక్షల విరాళాన్ని అందించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ తెలిపారు. బుధవారం సంగం డెయిరీ పాలకవర్గ సమావేశం జరిగింది. పలు కీలక నిర్ణయాలను చర్చించిన అనంతరం జరిగిన విలేకర్ల సమావేశంలో చైర్మన్ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది సంగం డెయిరీ రూ. 1877 కోట్ల టర్నోవర్ సాధించినట్లు చెప్పారు. పాల రైతులకు బోనస్ అందించిన తర్వాత రూ.12 కోట్ల లాభాలను సాధించినట్లు ప్రకటించారు. విజయవాడ నగరం ముంపునకు గురైన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు సంగం డెయిరీ పాలు, మజ్జిగ పంపిణీ చేశామన్నారు. బాధితుల సహాయార్థం సంగం భాగస్వామి కావటం సంతోషంగా ఉందన్నారు. పాల ఉత్పత్తిదారులు వరద బాధితులుగా మారటంతో వారి పశువుల సంరక్షణ కోసం 70 మెట్రిక్ టన్నుల పశు దాణాను ఉచితంగా అందించామన్నారు. ప్రభుత్వం కూడా రాయితీపై తక్కువ ధరకు పశుదాణా కోరిందని సరఫరా చేసినట్లు చెప్పారు. కరోనా సమయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం తమను వేధింపులకు గురిచేసి కేసులు నమోదు చేసినప్పటికీ సామాజిక బాధ్యతగా సీఎం సహాయ నిధికి విరాళం అందించాం అన్నారు. అలాగే సంగం డెయిరీ చట్టపరంగా అనుసరించాల్సిన విధానాలపై సమీక్ష చేసినట్లు చెప్పారు. త్వరలోనే రాష్ట్రంలోని అనంతపురంతోపాటు, ఐదు చోట్ల బీఎంసీలు ఏర్పాటు చేయాలని పాలకవర్గం నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. భవిష్యతుకు అనుగుణంగా సంగం డెయిరీని మరింత విస్తరణ ప్రణాళికలు రూపొందించుకున్నట్లు తెలిపారు. తెలంగాణలో ఏర్పాటు చేసిన ప్లాంట్‌లో కూడా త్వరలోనే కార్యకలాపాలు జరగనున్నట్లు వివరించారు. ఎండీ పి.గోపాల కృష్ణన్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేసే నైతిక హక్కు లేదు



మాట్లాడుతున్న జనసేన నేతలు గాదె, బోనబోయిన

గుంటూరు, సెప్టెంబరు 11: వరద బాధితులకు ఒక్క రూపాయి కూడా సహాయం చేయని మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డికి, ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మండిపడ్డారు. బుధవారం లాడ్జి కూడలిలోని జిల్లా జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్‌తో కలసి ఆయన మాట్లాడారు. కృష్ణా నదిలో బోటులను వదిలి బ్యారేజీని దెబ్బతీసేందుకు ప్రయత్నించిన వైసీపీ నాయకులు, వరద బాధితులపై మొసలి కన్నీరు కారుస్తున్నారని వారు ధ్వజమెత్తారు. టీడీపీ కార్యాలయంపై వైసీపీ నేతలు జరిపిన దాడిని, అక్కడ తోపులాటలో రాళ్లు పడ్డాయని జగన్‌మోహన్ రెడ్డి చెప్పడం సిగ్గు చేటన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన సొంత నిధుల నుంచి వరద బాధితులకు రూ.6 కోట్లు విరాళం అందజేసిన గొప్ప నాయకుడని తెలిపారు. మరో పక్క సీఎం చంద్రబాబు కూడా రాత్రింబగళ్లు వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉండి బాధితులకు అందే సాయం స్వయంగా పర్యవేక్షించారని చెప్పారు. ఇవేమి కనిపించని వైసీపీ నాయకులకు, పవన్‌ను, చంద్రబాబును విమర్శించడం చూసి ప్రజలు వైసీపీ నేతల తీరును అస్యహించుకుంటున్నారని ధ్వజమెత్తారు. జిల్లా పర్యటనకు వచ్చిన జగన్‌రెడ్డి బాధిత రైతాంగాన్ని కాకుండా సబ్ జైలులో ఉన్న మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను పరామర్శించడం చూసి ఆశ్చర్యపోయినట్లు తెలిపారు. రైతులను కలసి పది నిమిషాలు ఓదార్చే సమయంలేని జగన్ రెడ్డికి, మీడియా ఎదుట 45 నిమిషాల పాటు కూటమి ప్రభుత్వాన్ని విమర్శించేందుకు మాత్రం సమయం ఉందని విమర్శించారు. నదికి, డ్రెయిన్‌కు, కాలువకు తేడా తెలియని వ్యక్తి (జగన్) ముఖ్యమంత్రిగా ఎలా పని చేశాడో తమకు అర్థం కావడం లేదన్నారు. తప్పు చేసిన వారిని కూటమి ప్రభుత్వం విడిచిపెట్టదని, అప్పుడు టైం టేబుల్ వేసుకొని మరీ మాజీ సీఎం జగన్‌రెడ్డి తమ పార్టీ నేతలను పరామర్శించేందుకు జైళ్లకు వెళ్లాల్సి వస్తుందని ఎద్దేవా చేశారు. సమావేశంలో జనసేన కార్పోరేటర్ యర్రంశెట్టి పద్మావతి, నాయకులు అడపా మాణిక్యాలరావు, చట్టాల త్రినాథ్, పాకనాటి రమాదేవి, యడ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటును అడ్డుకున్న వైసీపీ



ఎస్ఐ అశోక్‌కు ఫిర్యాదు చేస్తున్న కాలనీ వాసులు

రొంపిచర్ల, సెప్టెంబరు 11: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్వగ్రామమైన బుచ్చిపాపన్నపాలెం గ్రామంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు వైకాపా నాయకులు అడ్డు తగిలారు. మంగళవారం రాత్రి గ్రామంలోని ఉప్పు ఏడుకొండలకు చెందిన సొంత స్థలంలో విగ్రహ నిర్మాణానికి దిమ్మెను ఏర్పాటు చేశారు. రెండు రోజుల్లో విగ్రహాన్ని ఏర్పాటు చేద్దామనుకుంటున్న తరుణంలో గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు కాలనీకి వచ్చి హల్‌చల్ చేశారు. విగ్రహం ఏర్పాటు చేయవద్దంటూ వారిని బెదిరించారు. తమ అనుమతితోనే ఏ పనులైనా చేయాలని వైసీపీ నాయకులు పేర్కొన్నట్టు వారు తెలిపారు. ఇందిరమ్మ కాలనీలో విగ్రహం ఏర్పాటు ఎలా చేస్తారని వైసీపీ నేతలు ప్రశ్నించినట్టు తెలిపారు. తమను బెదిరించటంపై రొంపిచర్ల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. తమ సొంత స్థలంలో విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటుంటే ఈ విధంగా చేయటం దారుణమన్నారు. తమకు ప్రాణ హాని ఉందని ఎస్ఐ అశోక్‌కు ఫిర్యాదు చేశారు. సుమారు 40 మంది కాలనీ వాసులు స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ అశోక్ మాట్లాడుతూ గ్రామంలోకి వెళ్లి పరిస్థితిని సమీక్షిస్తామని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రోద్భలంతోనే వైసీపీ నాయకులు తమను బెదిరిస్తున్నారని తెలిపారు.

అక్రమ మైనింగ్ వాస్తవమే..



మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆనంద్, జెస్సీ

నకరికల్లు, సెప్టెంబరు 11: నకరికల్లు మండలంలో క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ వాస్తవమేనని ఆ శాఖ అధికారులు నిర్ధారించారు. 'క్వార్ట్జ్‌పై కన్ను' శీర్షికతో అక్రమ తవ్వకాలపై వెలువడిన కథనానికి మైనింగ్ అధికారులు స్పందించారు. బుధవారం మైనింగ్ జరుగుతున్న క్వార్ట్జ్ మైనింగ్ ప్రాంతాలను పరిశీలించారు. మైనింగ్ జరుగుతున్న ప్రాంతానికి, మైనింగ్ అనుమతులు తీసుకున్న ప్రాంతానికి సంబంధం లేకుండా ఉన్నట్టు గుర్తించారు. ఎంత మేర అక్రమంగా మైనింగ్ జరిగిందనే విషయాన్ని సర్వే చేశారు. ఏయే ప్రాంతాల్లో మైనింగ్ జరిగిందో, ఏ స్థాయిలో జరిగిందో, సర్వే చేసి నివేదిక సిద్ధం చేయనున్నట్టు అసిస్టెంట్ జియాలజిస్ట్ జి. ఆనంద్ తెలిపారు. జిల్లా మైనింగ్ అధికారి నాగిని ఆదేశాల మేరకు తాను, మైనింగ్ సర్వేయర్ జెస్సీ అక్రమ మైనింగ్‌పై విచారణ చేపట్టినట్టు తెలిపారు. ఏ ప్రాంతానికి అనుమతులు ఉన్నాయి, అనుమతి లేని ప్రాంతాలపై నివేదిక సిద్ధం చేస్తామన్నారు. అక్రమ మైనింగ్‌పై చేజర్ల, నరసింగపాడు, నకరికల్లులో, త్రిపురాపురం కొండ ప్రాంతంలోనూ పరిశీలించినట్టు తెలిపారు. సర్వే నంబరు 97లో మైనింగ్ అనుమతి కోసం రెండు హెక్టార్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, కాని క్లియరెన్స్ రాక ముందే అక్రమంగా మైనింగ్ జరిగినట్టు గుర్తించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వరద బాధితులకు రూ.2 లక్షల విరాళం



సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న దుర్గాప్రసాద్, సతీష్‌శర్మ, మాజీ మంత్రి ఆలపాటి

గుంటూరు, సెప్టెంబరు 11: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ముందుకొచ్చింది. వరద బాధితుల సహాయార్థం రూ.2 లక్షల చెక్కును ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనూరు సతీష్‌శర్మ సీఎం చంద్రబాబుకు విజయవాడలో అందజేశారు. కార్యక్రమంలో సంఘం మహిళా విభాగం కన్వీనర్ కరి నాగలక్ష్మి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తదితరులున్నారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు జగన్‌కు లేదు



మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, సెప్టెంబరు 11: ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు జగన్‌కు లేదనీ, ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో కూడా జగన్ తీరు మారలేదని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. టీడీపీ ఆఫీస్‌పై దాడిని సమర్థించుకోవటం దారుణమని, వరద కారణంగా జనం కష్టాల్లో ఉంటే ప్రజలను పరామర్శించకుండా జైలుకు వెళ్లి ఓ క్రిమినల్‌ను పరామర్శించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. వైసీపీకి 11 సీట్లు కూడా ఎందుకు ఇచ్చామని ప్రజలు బాధ పడుతున్నారని అనగాని మండిపడ్డారు. జగన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో సహజ వనరులను దోచుకున్నారని విమర్శించారు. భూములను కబ్జాలు చేసి కోట్లాది రూపాయలు దోచుకున్న ఘనత జగన్‌ది అన్నారు. రాష్ట్రం వరదలు వచ్చి ప్రజలు నానా ఇబ్బందుల్లో ఉంటే వారికి బాసటగా నిలవకపోగా రాజకీయాలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులను పరామర్శించాలంటే రోడ్డుపైనే స్టేజీ వేసి రైతులను అక్కడకు తీసుకొచ్చి పరామర్శించారే తప్పా ఎక్కడ మునిగిన ప్రాంతానికి వెళ్లిన దాఖలాలు లేవన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజయవాడ కలెక్టర్ ఆఫీస్‌ను క్యాంప్ ఆఫీస్‌గా మార్చుకుని 9 రోజుల పాటు అక్కడే ఉండి నిరంతరం వరద బాధితులకు కావాల్సిన ఆహారం, సదుపాయాలను నేరుగా బాధితుల వద్దకే నీళ్లల్లో నడుచుకుంటూ పడవల్లో వెళ్లి అండగా నిలిచారని తెలిపారు. కేంద్ర బృందం బాపట్ల జిల్లాలో లంకగ్రామాల్లో భట్టిప్రోలు మండలంలో కృష్ణా కరకట్ట, రేపల్లె మండలం రావిఅనంతవరం వద్ద పరిశీలించగా చెరుకుపల్లి మండలం కనగాలలో నేటికి వేలాది ఎకరాలు నీటిలోనే ఉన్న పంటను చూపించి ఆదుకోవాలని కోరినట్లు తెలిపారు.

నోరు విప్ప వద్దనే జగన్ ములాకత్ రాజకీయం



ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, సెప్టెంబరు 11: ప్రకాశం బ్యారేజీని కూల్చి లక్షల మందిని ముంచాలన్న కుట్ర కేసులో మాజీ ఎంపీ నందిగం సురేష్ నోరు విప్ప కూడదనే జగన్ ములాకత్ రాజకీయం చేస్తున్నారని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో విరుచుకుపడ్డారు. ప్రజలు విపత్తుల్లో ఉంటే సాయం చేయాల్సింది పోయి మహా విధ్వంసానికి ప్లాన్ చేసి దొరికిపోవడంతో నిజాలు బయట పడకుండా ఉండేందుకే జగన్ పాట్లు పడుతున్నారని అన్నారు. ప్రకాశం బ్యారేజీ కూల్చేసే కుట్ర వెనుక మాజీ సీఎం జగన్, సజ్జల, శీతల రఘురాం, నందిగం సురేష్ హస్తం ఉందని ఆరోపించారు. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో గుంటూరు జిల్లా జైల్లో ఉన్న మాజీ ఎంపీ సురేష్‌ను జగన్ ములాకత్‌లో కలవడంపై ఈమేరకు ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. జైల్లో పోలీసులు గట్టిగా అడిగినా తమ పేర్లు ఎక్కడా చెప్ప వద్దని సమాచారం చేరవేయడానికే ఆగమేఘాలపై జగన్ ములాకత్‌కు పరుగులు తీశారన్నారు. ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత జగన్ చేసిన తొలిరాజకీయ పర్యటన నాడు నెల్లూరు జైల్లో ఉన్న మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో ములాకత్ అని, ఇప్పుడు గుంటూరు జైలుకు వచ్చి నందిగమ సురేష్ పరామర్శకు వచ్చారన్నారు. ఏనాటికైనా జగన్ సహ అతడి బ్యాచ్ మొత్తం జైలుకు పోవడం మాత్రం స్పష్టం అన్నారు.

ప్రత్తిపాటి పుల్లారావుకు మాతృవియోగం



చిన నారాయణమ్మ

చిలకలూరిపేట, సెప్టెంబరు11: మాజీమంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాతృమూర్తి ప్రత్తిపాటి చిన నారాయణమ్మ(85) గుండెపోటుతో బుధవారం ఉదయం హైదరాబాదులో కన్నుమూశారు. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధ పడుతున్నారు. వైద్య సేవలు పొందుతూ హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చిన నారాయణమ్మ తుది శ్వాస విడిచారు. ఈ విషయం తెలిసిన వెంటనే పుల్లారావు హుటాహుటిన చిలకలూరిపేట నుంచి హైదరాబాదుకు బయలుదేరి వెళ్లారు. హైదరాబాద్‌లో ఆమె భౌతికకాయం వద్ద ఆయనతోపాటు బంధువులు, శ్రేయోభిలాషులు నివాళులర్పించారు. అనంతరం ఆమె భౌతికకాయాన్ని రాత్రి 7 గంటల ప్రాంతంలో చిలకలూరిపేటకు తీసుకువచ్చారు. గురువారం ఉదయం చిలకలూరిపేటలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పలువురు పట్టణ ప్రముఖులు పుల్లారావు గృహం వద్దకు వచ్చి చిన్న నారాయణమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. చిన నారాయణమ్మ మృతిపట్ల టీడీపీ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు సంతాపం తెలిపారు.

రషీద్ ఎంపికపై హర్షం

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 11: ఇండియా-ఏ క్రికెట్ జట్టులో గుంటూరు జిల్లాకు చెందిన షేక్ రషీద్ ఎంపికవ్వడంపై ఆయన తల్లిదండ్రులు, క్రికెట్ అసోసియేషన్ సభ్యులు, అభిమానులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. కొత్తగా ప్రకటించిన ఇండియా ఏ జట్టులో రషీద్‌కు అవకాశం ఇవ్వడంపై తల్లిదండ్రులు జ్యోతి, బాలీషావలీలు హర్షం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ జీవితంలో మరపులేని రోజు అంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అండర్-19 వరల్డ్ కప్ గెలుపులో రషీద్ కీలకపాత్ర పోషించాడని, ఐపీఎల్ ఈ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో ఉండి రాణించారని గుర్తుచేశారు. ముఖ్యంగా అండర్-19 వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌లో రషీద్ కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడని అన్నారు. క్రికెట పట్ల రషీద్‌కు ఉన్న ఆసక్తిని గమనించి, ప్రత్యేక శిక్షణ ఇప్పించామని, ఆయన ఎదుగుదలలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రోత్సాహం ఎంతో ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

30,198 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 32,598 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 30,198 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 19,975 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్టధర	గరిష్టధర	వెరైటీ	కనిష్టధర	గరిష్టధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	15500	334	8000	15800
నెంబరు. 5	9000	15500	నెంబరు. 5	9000	13000
273	10000	13500	273	10000	12000
341	8000	16000	341	8500	15000
4884	--	--	4884	--	--
సూపర్ 10	10500	10500	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18600	తేజ	8000	18500
బ్యాడిగి	8000	14500	బ్యాడిగి	8500	13500
దేవనూరు డీలక్స్	8500	15000	దేవనూరు డీలక్స్	9000	15000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	5000	11000



ఎమ్మెల్యే నరేంద్రవర్మకు వినతిపత్రం అందజేస్తున్న దళిత గిరిజన బడ్జెట్‌వాచ్ సభ్యులు

గిరిజనుల సంక్షేమానికి కృషి చేయాలి

● ఎమ్మెల్యే వేగేశనను కోరిన దళిత గిరిజన బడ్జెట్‌వాచ్ సభ్యులు

బాపట్ల, సెప్టెంబరు 11 : జిల్లాలోని దళిత గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ దళిత గిరిజన బడ్జెట్ వాచ్ సభ్యులు బుధవారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో త్వరలో ప్రవేశపెట్టబోతున్న బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ కాంపోనెంట్ కింద వివిధ పథకాలకు నిధుల కేటాయింపునకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రజల అవసరాలకు అనుగుణంగా నూతన ప్రభుత్వ విద్యాసంస్థలు ఏర్పాటు చేయాలని, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంపుదల చేసి సౌకర్యాలు మెరుగుపర్చాలన్నారు. నూతన గురుకుల పాఠశాలలు నిర్మించాలని, పీజీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో బడ్జెట్‌వాచ్ జిల్లా ఛైర్మన్ దేవరపల్లి డేవిడ్ రాజు, జిల్లా కన్వీనర్ దార్ల కోటేశ్వరరావు, అంటరానితన నిర్మూలన పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.చార్వాక, కమిటీ సభ్యులు పి.ప్రసాద్, గుదే రాజారావు, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, నవతరం పార్టీ నాయకులు తిరుపతిరావు, డీబీఆర్‌సీ ఏరియా కో ఆర్డినేటర్ శ్రీలత, వి.భగవాన్‌దాసు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవి ఎస్సీలకు కేటాయించాలి

బాపట్ల, సెప్టెంబరు 11 : బాపట్ల వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్ పదవి ఎస్సీలకు కేటాయించాలని కోరుతూ దళిత నాయకులతో కలిసి బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుదే రాజారావు బుధవారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వాలు ఎస్సీలకు తీరని అన్యాయం చేశాయి కావున కూటమి ప్రభుత్వం దళితులకు న్యాయం చేసే విధంగా మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవి ఎస్సీలకు కేటాయించాలని కోరారు. వైసీపీ పాలనలో దళితులకు వ్యతిరేకంగా పని చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో దళితనాయకులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా సీఎం సహాయనిధి

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 11 : అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ స్థాయిలో వైద్యం పొందలేని బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి దోహదపడుతుందని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. మండలపరిధిలోని మంతెనవారిపాలెం గ్రామపంచాయతీకి చెందిన మంతెన లక్ష్మీ ప్రసన్న హైదరాబాద్‌లోని సిందూ వైద్యశాలలో చికిత్స పొందుతుండగా బుధవారం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఎల్‌వోసీని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ చేతుల మీదగా బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు లక్కంరాజు వెంకటపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

కొల్లూరు మండలంలో ఎమ్మెల్యే సునీత పర్యటన

కొల్లూరు, సెప్టెంబరు 11 : రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కొల్లూరు మండలంలోని లంక గ్రామాల్లో పర్యటించారు. బుధవారం మండల పరిధిలోని సుగ్గునలంక చప్టా వద్ద వరదలకు దెబ్బతిన్న వాణిజ్య పంటలను మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి ఆమె పరిశీలించారు. కొల్లూరులోని కాకతీయ కళ్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద పూజల్లో పాల్గొని ఆశీర్వచనాలు పొందారు. మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

బాపట్ల, సెప్టెంబరు 11 : పట్టణంలోని చీలురోడ్డు సెంటర్‌లో ఆటో డివైడర్‌ను ఢీకొట్టిన సంఘటనలో ఏప్రిల్ 4న తీవ్రంగా గాయపడి రెండుకాళ్ళు, ఒక చేతికి చికిత్స చేయించుకొని జూలై నెలలో డిశ్చార్జి అయిన ఉప్పులూరి గంగయ్య మృతి చెందినట్లు భార్య రాజకుమారి బుధవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పట్టణ ఎస్సై విజయ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై పునఃపరిశీలించాలి

రేపల్లె, సెప్టెంబరు 11 : ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును పునః పరిశీలించాలని న్యాయవాది దోవరమేష్‌రాంజీ అన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కి విరుద్ధంగా జిల్లా ప్రాతిపదికన వర్గీకరణ అమలు చేస్తామన్న ఏపీ ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద న్యాయవాదులు నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ కులాలను విభజించి పాలించి వారి ఉనికికే ప్రమాదం వాటిల్లే పరిస్థితి నెలకొందన్నారు. జాతీయ నాయకులు చేస్తున్న పోరాటానికి వర్గీకరణ ప్రతిఘటన సమితికి రేపల్లె న్యాయవాదుల విభాగం పూర్తి మద్దతునిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కర్రా ప్రతాప్, నాలాది పోతురాజు, పెరికల జీవన్‌కుమార్, గుమ్మడి కుమార్‌బాబు, కొనకాల ప్రసాద్, ఎ.గోపిరాజు, ఎన్.చిన్న నాంచారయ్య, కర్రా బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలి

రేపల్లె, సెప్టెంబరు 11 : గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో మాణిక్యం అన్నారు. మండలంలోని పేటేరు గ్రామంలో పౌష్టికాహార మాసోత్సవాన్ని పురస్కరించుకుని అంగన్‌వాడీలకు,కార్యకర్తలకు బుధవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల ఒకటవ తేది నుంచి సెప్టెంబరు 30వ తేది వరకు పౌష్టికాహార మాసోత్సవాలను జయప్రదం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ రజని, కార్యకర్తలు పి.వాణి, సిహెచ్ అరుణ కుమారి, ఎం.మోహినికుమారి,సూపర్‌వైజర్ సీహెచ్ శివజ్యోతి పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 11 : మండలంలోని అల్లూరు గ్రామపంచాయతీ అల్లూరు రెడ్లపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషక మాసోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల సీడీపీవో లక్ష్మీపార్వతి పాల్గొని మాట్లాడుతూ పోషకాహారాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చందోలు అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ ఎ.అరుణకుమారి, పంచాయతీ పరిధిలోని ఎఎన్‌ఎంలు సీహెచ్ అరుణకుమారి, సీహెచ్ నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.సువర్చల, పి.లావణ్య, పి.శివకుమారి, డి.ఉమాదేవి, టి.ఉషారాణి, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి మట్టి ఖర్చులు అందజేత

వేమూరు, సెప్టెంబరు 11 : మండలంలోని వరహాపురంలో యల్లమాటి బాబురావు (60)మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న గ్రేస్ ఫౌండేషన్ మృతుని కుటుంబానికి ఆసరాగా నిలిచింది. సంస్థ అధినేత డాక్టర్ కైతేపల్లిషాలెంరాజు ఆదేశాల మేరకు మృతుడి కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చులు నిమిత్తం గ్రేస్ ఫౌండేషన్ ప్రతినిధులు రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో గ్రేస్ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు పి.అనిల్, గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకుడు యల్లమాటి రాజు, గ్రామ సర్పంచ్ యల్లమాటి స్వాతి, సత్యానందబాబు, రవి, ఆనందరావు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన ర్యాలీ

బాపట్ల, సెప్టెంబరు 11 : జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం వద్ద బుధవారం హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామసిరివారి ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది, ఆషా వర్కర్లతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అవుట్ రీచ్‌వర్కర్ ఓ.లక్ష్మి, డీఎస్‌ఆర్‌సీ కౌన్సిలర్ షేక్ బాజితున్నీసా, పీఈలు స్వరూపా, రాజి పాల్గొని అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు హెచ్‌ఐవీపై అవగాహన కలిగిఉండి ఎయిడ్స్ నిర్మూలనకు కృషి చేయాలన్నారు.

చంద్రబాబు సహాయక చర్యలు చరిత్రలో నిలిచిపోతాయి : కొల్లా

బాపట్ల, సెప్టెంబరు 11 : వరద ప్రభావిత ప్రాంతాలలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూటమి నాయకులు, అధికారులతో కలిసి చేపట్టిన సహాయక చర్యలు చరిత్రలో నిలిచిపోతాయని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. వైసీపీ శ్రేణుల ప్రభుత్వంపై బురద జల్లే రాజకీయాలు చేయటం తప్ప చేసిన సహాయక చర్యలు ఏమిలేవన్నారు. వరద బాధిత ప్రాంతాలు కుదుట పడేవరకు చంద్రబాబు అక్కడే ఉండి సేవలందించారన్నారు. నాడు విశాఖ హుద్‌హుద్ తుఫాన్ సమయంలో, నేడు విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాలలో ప్రజలకు విశేష సేవలందించారన్నారు.

లంక గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన

● వరద తాకిడికి దెబ్బతిన్న గృహాలు, వాణిజ్య పంటలు పరిశీలన

● చింతల్లంకలో డ్వాక్రా, పంట రుణాలు రద్దు చేయాలని కోరిన మహిళలు



పెసర్లంక రామన్నపేటలో వరదకు దెబ్బతిన్న గృహాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

కొల్లూరు, సెప్టెంబరు 11 : వరద ప్రభావిత గ్రామాల్లో కేంద్ర బృందం సభ్యులు వాగ్మేర్, కౌల్, ప్రదీప్‌కుమార్ పర్యటించారు. కొల్లూరు మండలంలోని సుగ్గునలంక, ఈపూరులంకలో వరదకు దెబ్బతిన్న పసుపు, అరటి, బూడిద గుమ్మడికాయ పంటలను బుధవారం బృంద సభ్యులు పరిశీలించారు. వరద వల్ల దెబ్బతిన్న పంటల గురించి కలెక్టర్ జె.వెంకటమురళి, జిల్లా ఉద్యాన శాఖాధికారులు వారికి వివరించారు. ఏయే పంటకు ఎంత సాగుకు ఖర్చు అవుతుందో బృంద సభ్యులు అడుగగా పసుపు పంటకు రూ.1.20 నుంచి 1.50 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. వరదకు దెబ్బతిన్న కంద, అరటి, మొక్కజొన్న తదితర పంటలను కేంద్ర బృంద సభ్యులు పరిశీలన చేశారు. కలెక్టర్ అక్కడ నుంచి అరవింద వారధి వద్ద గండిని పరిశీలించేందుకు వెళుతుండగా మార్గమధ్యలో చింతల్లంక వద్ద మహిళలు, రైతులు కేంద్ర బృందంతో వస్తున్న కలెక్టర్ కాన్వాయ్‌ను ఆపి తమ గోడును వెళ్లబోసుకున్నారు. వరద వల్ల పంటలన్నీ పూర్తిగా కోల్పోయామని పశువులకు పశుగ్రాసం కూడా లేకుండా పోయిందని వాపోయారు. ఇంత భారీ నష్టం జరిగినందువల్ల డ్వాక్రా, పంట రుణాలను రద్దు చేయాలని కలెక్టర్‌ను కోరగా ఆ విషయాన్ని కేంద్ర బృంద సభ్యులకు వివరించారు. రుణాల కోసం మూడు నెలల వరకు ఒత్తిడి చేయవద్దంటూ బ్యాంకర్లకు చెబుతానని చెప్పగా ఇంతటి భారీ నష్టం వల్ల రుణాలు చెల్లించే పరిస్థితి లేదని, రుణమాఫీయే ఇందుకు పరిష్కారం అంటూ మహిళలు, రైతులు ఆయనను వేడుకున్నారు. అరవింద వారధి వద్ద వరద వల్ల పడిన గండిని బృంద సభ్యులు పరిశీలించగా అక్కడ అడ్డుగోడ నిర్మిస్తే వరద నీరు గ్రామాలను, పంటలను ముంచెత్తకుండా ఉంటుందని కలెక్టర్ వారికి తెలిపారు. అక్కడ నుంచి పెసర్లంక రామన్నపేటలో వరద ఉధృతికి దెబ్బతిన్న కొల్లూరు రాధాకృష్ణ గృహాన్ని కలెక్టర్, కేంద్ర బృందం సభ్యులకు చూపించి జరిగిన నష్టాన్ని వివరించారు. గృహంలోని వస్తువులన్నీ వరదకు కొట్టుకుపోవడంతో, బాధిత కుటుంబం పూర్తిగా నిరాశ్రయులయ్యారని కలెక్టర్ బృందానికి తెలిపారు. కొల్లూరు కరకట్ట దిగువున ఉన్న ఆర్ అండ్ బీ రోడ్డు మూడు అడుగుల ఎత్తులో సీసీ రోడ్డు నిర్మాణం చేస్తే వరదల సమయంలో లంక గ్రామాలకు రవాణా సౌకర్యం అంతరాయం లేకుండా ఉంటుందని వివరించారు. భట్టిప్రోలు మండలంలోని ఓలేరు పల్లెపాలెం వద్ద వరదకు కోత పడిన కరకట్టను బృంద సభ్యులు పరిశీలించారు. అక్కడి నుంచి రేపల్లె మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలకు కలెక్టర్ వారిని తోడ్కొని వెళ్లారు. పరిశీలనలో కలెక్టర్‌తో పాటు జేసీ ప్రఖర్‌జైన్, ఆర్డీవో హేలాషారోన్, జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర బృందానికి కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్

వేమూరు, సెప్టెంబరు 11 : వేమూరు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో బుధవారం కేంద్ర బృందానికి కలెక్టర్ వెంకట మురళి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. వరద కారణంగా నష్టానికి గురైన పంట పొలాలు, ఇళ్ళు, రోడ్లు, పశుసంపదలను అంచనాలు రూపొందించినట్లు తెలిపారు. ఈ ప్రాంతం పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం కావడంతో రైతులు అపారమైన నష్టాన్ని చవిచూశారన్నారు. స్థానిక శాసన సభ్యులు నక్కా ఆనందబాబు జిల్లా మంత్రులు సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ తదితర ప్రజాప్రతినిధులు, వివిధశాఖల అధికారులు ఎంతో బాధ్యతగా పని చేయడం వలన ప్రాణనష్టం జరగకుండా చూశామని వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర పరిశీలక బృంద సభ్యులు నాగపూర్‌కు చెందిన ఎంఒఎ డైరెక్టర్ వాఘ్‌మేర్, ఢిల్లీకి చెందిన ఎంఓఎఫ్ కన్సల్‌టెంట్ కౌల్, ఢిల్లీకి చెందిన ఎంఓఆర్‌డి డిప్యూటీ సెక్రటరీ ప్రదీప్‌కుమార్‌లు సమీక్షకు హాజరైన అనేకశాఖల అధికారులను వారికి సంబంధించిన నష్టం వివరాలపై ప్రశ్నించారు. సమావేశానికి విద్యాశాఖ జిల్లా అధికారి గైర్హాజరుకావడంతో ఆ శాఖకు సంబంధించిన సమాచారం అందలేదు. జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల ఫొటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర బృందం తిలకించింది. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ వరద నష్టాన్ని గతంలో ఎన్నడూ లేని విధంగా ఎదుర్కొవడం జరిగిందని కేంద్ర సాయం అందుకు తగిన విధంగా ఉండేలా చూడాలని అధికారులను కోరారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, మూడు డివిజన్ల ఆర్డీవోలు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు. వేమూరు తహసీల్దార్ సుశీల, మండల రెవెన్యూ యంత్రాంగం జిల్లా స్థాయి సమావేశానికి ఏర్పాట్లు చేశారు.

వరద కారణంగా తీవ్ర నష్టం : కలెక్టర్



సర్వం కోల్పోయామంటూ కేంద్ర బృందం వద్ద విలపిస్తున్న వరద బాధితులు

రేపల్లె, సెప్టెంబరు 11 : తీరప్రాంతంలో వరదలు అధిక వర్షాల కారణంగా తీవ్రనష్టాన్ని చవిచూడటం జరిగిందని కలెక్టర్ జే.వెంకటమురళి అన్నారు. కేంద్ర బృంద సభ్యులతో చెరుకుపల్లి మండలం కనగాలలో నీటిలో నానుతున్న వరిపైరును బుధవారం పరిశీలించిన అనంతరం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 8,600 హెక్టార్లలో అగ్రికల్చర్ పంట నష్టం వాటిల్లిందని, 11,500 హెక్టార్లలో హార్టికల్చర్ పంట నష్టం వాటిల్లిందని, రైతులు సాగు చేసిన 8,600 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని, 7,985 గృహాలు దెబ్బతిన్నాయని తెలిపారు. వీటన్నింటికి నష్టపరిహార అంచనాలను రూపొందిస్తున్నామని తెలిపారు. ఆర్ అండ్ బీ రహదారులు, పంచాయతీ రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని, పాఠశాలలు, పంచాయతీ భవనాలు, హెల్త్ సిటీలకు తీవ్రనష్టం వాటిల్లిందన్నారు. కృష్ణాకరకట్టను అభివృద్ధి చేసే దిశగా అధికారులు కేంద్ర బృందానికి అంచనాలను రూపొందించి అందిస్తామని తెలిపారు. ఓలేరుపల్లెపాలెం, పెనుమూడి పల్లెపాలెంలో గృహాలు పూర్తిగా కోల్పోయారని, కట్టుబట్టలతో బయటకు వచ్చారని వారిని పూర్తిస్థాయిలో ఆదుకునేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేంద్రబృంద సభ్యులు, జేసీ ప్రఖర్‌జైన్, రేపల్లె, చీరాల ఆర్డీవోలు హేలా షారోన్, సూర్యనారాయణరెడ్డి, కృష్ణారివర్ ఏఈ నాగేశ్వర్‌నాయక్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి వై.రామకృష్ణ, ఏడీఏ ఆర్.విజయబాబు,ఎంఏవో పి.బాలాజీ గంగాధర్, తహసీల్దార్‌లు మోర్ల శ్రీనివాసరావు, పద్మావతి పాల్గొన్నారు.



భక్తులకు వడ్డిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, టీడీపీ నాయకులు



వేమూరులో గణపతి పూజలో పాల్గొన్న మాజీ మంత్రులు పరిటాల సునీత, ఆలపాటి రాజేంద్రప్రసాద్

ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు

బాపట్ల, సెప్టెంబరు 11 : పట్టణంలోని విజయలక్ష్మీపురంలో నిర్వహిస్తున్న వినాయకచవితి ఉత్సవాలలో భాగంగా బుధవారం అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఉత్సవకమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పార్టీశ్రేణులతో కలిసి పాల్గొని స్వామి వారికి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో భక్తులకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పట్టణంలోని కారుమూరి హనుమంతరావు నాయుడు కాలనీలో నిర్వహిస్తున్న వినాయకచవితి ఉత్సవాలలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ, టీడీపీ, జనసేన నాయకులతో కలిసి బుధవారం పాల్గొన్నారు. కాలనీయూత్ సభ్యులు ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద పూజలు నిర్వహించి అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులకు వడ్డించి విఘ్నేశ్వరుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



శీలంవారిపాలెంవీధిలో వినాయక మండపం వద్ద పూజలు చేస్తున్న అన్నం సతీష్ ప్రభాకర్

● పట్టణంలోని శీలంవారిపాలెం వీధిలో ఉన్న శ్రీ వరదసిద్ది వినాయకుని విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్ బుధవారం నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు, యూత్‌తో కలిసి స్వామి వారికి పూజలు చేశారు. 21వ వార్షికోత్సవం సందర్భంగా భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేయగా అన్నం సతీష్ ప్రారంభించి భక్తులకు వడ్డించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పట్టణంలోని త్యాగరాయ్‌నగర్‌లో నిర్వహిస్తున్న వినాయకచవితి ఉత్సవాలలో బుధవారం నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు, చిన్నారులు, కమిటీ సభ్యులు కలిసి పురవీధులలో గణనాధుని ఊరేగింపు చేసి అనంతరం నిమజ్జనానికి తీసుకెళ్ళారు.

● పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న వినాయకచవితి ఉత్సవాలలో భాగంగా బుధవారం స్వామివారి లడ్డులకు వేలం పాట నిర్వహించారు. మొదటి లడ్డును బొమ్మిశెట్టి లక్ష్మీనారాయణ 50 వేల రూపాయలకు, రెండో లడ్డు నాగవరపు శేషగిరిరావు 13,500 రూపాయలకు వేలం పాటలో దక్కించుకున్నారు. అనంతరం వినాయకుని విగ్రహాన్ని ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకెళ్ళారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొత్తమాసు సత్యనారాయణరావు, కార్యదర్శి కోళ్ళపూడి సురేష్, కమిటీ సభ్యులు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాల్గొన్నారు.

● బాపట్ల మండలంలోని నందిరాజుతోట గ్రామంలో నిర్వహిస్తున్న వినాయకచవితి ఉత్సవాలలో భాగంగా బుధవారం అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ పార్టీశ్రేణులతో కలిసి పాల్గొని స్వామి వారికి పూజలు చేసి అక్కడ జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఎస్.రమణ, కె.వెంకటేశ్వరరావు, కందుల బాలకోటేశ్వరరావు పాల్గొన్నారు.

గణపతి ఉత్సవ ఉద్వాసన పూజలో మాజీ మంత్రులు

వేమూరు, సెప్టెంబరు 11 : వేమూరులో కమ్మజనసేనా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 20వ మహాగణపతి వార్షిక ఉత్సవాలలో భాగంగా బుధవారం ఉపవాసన పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు ఆలపాటి రాజేంద్రపసాద్, పరిటాల సునీత, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు స్వాగతించి సత్కరించారు. పండితులు వేద ఆశీర్వచనం చేశారు. పలువురు టీడీపీ, జనసేన పార్టీల శ్రేణులు పాల్గొన్నారు. జంపని సిద్ది వినాయక ఆలయ ఉత్సవాల్లో భాగంగా ఉద్వాసన పూజ జరిపి గ్రామోత్సవం జరిగిన తర్వాత గాజులంక కృష్ణా జలాలలో నిమజ్జనం చేశారు.

●పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 11 : మండలంలోని జీఎన్‌పాలెం గ్రామపంచాయతీలోని రామాలయంలో నిర్వాహకులు గణనాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించి బుధవారం గ్రామస్థులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, భక్తులు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

● కొల్లూరు, సెప్టెంబరు 11 : పరిధిలోని కొల్లూరు 3, గాజుల్లంక 2, క్రాప 2, దోనేపూడి, కోటిపల్లి, చినపులివర్రు, సుగ్గునలంక, కొత్తచిలుమూరులో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 11 చోట్ల వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా గ్రామ పురవీధుల్లో కనక తప్పెట్లు, డీజేలతో గ్రామోత్సవం నిర్వహించి రేపల్లె బ్యాంకు కెనాల్‌లో నిమజ్జనాలు జరిపారు.

● కర్లపాలెం, సెప్టెంబరు 11 : విఘ్నాలను తొలిగించే స్వామి విఘ్నేశ్వరస్వామి అని బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షులు నక్కల వెంకటస్వామి అన్నారు. బుధవారం కర్లపాలెం మండలం నర్రావారిపాలెం గ్రామంలో వినాయకునికి పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం వినాయక నిమజ్జనం సందర్భంగా గ్రామంలోని వీధులలో ఊరేగింపు నిర్వహించారు. మండలంలోని గణపవరం గ్రామంలో కాపు కమిటీ హాల్ వద్ద ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద బుధవారం స్వామి వారి లడ్డును రూ.35,500కు దేవిరెడ్డి బ్రదర్స్ పాడుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కర్లపాలెం మండల ఏట్రవారిపాలెంలో విఘ్నేశ్వరునికి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో గ్రామసర్పంచ్ చీరాల వెంకటలక్ష్మీ, శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

● చెరుకుపల్లి, సెప్టెంబరు 11 : వినాయక చవితి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. చెరుకుపల్లిలోని వీరరాఘవయ్యపేటలో బుధవారం ఏర్పాటు చేసిన 19వ వినాయక ఉత్సవాలలో లడ్డుకు వేలం నిర్వహించిన రూ.67,116కు అదే గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు అందే శ్రీనివాసరావు కైవసం చేసుకున్నారు. అదే విధంగా పొన్నపల్లిలో వినాయకుడి లడ్డును గుళ్ళపల్లి గ్రామస్తులు రూ.30 వేలకు కైవసం చేసుకున్నారు. కనగాల వద్ద ఉన్న వెల్లటూరు ఛానల్, కుంచాలవారిపాలెం వద్ద ఉన్న తెనాలి ఛానల్‌లో వినాయకుని విగ్రహాలకు నిమజ్జన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కాల్వల వద్ద పోలీస్ సిబ్బంది విద్యుత్‌దీపాలను ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరిశీలిస్తున్నారు.



పల్లెపాలెం వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న అనగాని శివప్రసాద్

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

రేపల్లె, సెప్టెంబరు 11 : వరదబాధితులకు స్వచ్ఛంద సంస్థలు బాసటగా నిలవటం అభినందనీయమని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. మండలంలోని పెనుమూడి పల్లెపాలెం వరద బాధితులకు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ బాధితులకు రోటరీ క్లబ్ వారికి అండగా నిలవటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు మాదాల మోహన్‌లాల్‌సక్సేనా, పావులూరి శివశంకరప్రసాద్, కోడూరి కృష్ణమూర్తి, కేవీ నాగమల్లేశ్వరరావు, వేపూరి సాయేశ్వరరావు, తలశిల రామారావు, గోవర్ధన్ శేషచల శ్రీనివాసరావు, వేములపల్లి రామచంద్రరావు, గొట్టుముక్కల బాపారావు, మల్లెల రామచంద్రరావు,ప్రభల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అమ్మకేర్ ట్రస్టు సభ్యుల సహాయం

పల్లెపాలెంలో ప్రజాసంఘాలు నిర్వహణలో అమ్మ కేర్ చారిటబుల్ ట్రస్టు సహకారంతో బుధవారం బాధితులకు దుప్పట్లను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ మణిలాల్, అమ్మ కేర్ ట్రస్టు సభ్యులు దుర్గారావు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు కె.ఝాన్సీ, ఆదిలక్ష్మి, వెంకటలక్ష్మి, కె.లక్ష్మణ్‌రావు, ఎం.రామారావు, ధర్మరాజు, పంతాని మురళీధరరావు, ఉప్పాల శ్రీనివాసరావు, కొక్కిలిగడ్డ ధనుంజయరావు పాల్గొన్నారు.

విద్యార్థులు సహాయనిధి సేకరణ

భట్టిప్రోలు, కొల్లూరు, సెప్టెంబరు 11 : వరద బాధితుల కోసం విద్యార్థినీ, విద్యార్థులు సహాయ నిధిని సేకరించారు. భట్టిప్రోలు, టిఎం రావు జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థినీ, విద్యార్థులు బుధవారం గ్రామ పురవీధుల్లో సహాయ నిధి సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు సహకరించి తమ వంతు విరాళాలను బాధితుల కోసం అందజేసినట్లు తెలిపారు. నిధి సేకరణ కార్యక్రమాన్ని ఎంఈవో దేవరాజ్, ప్రధానోపాధ్యాయులు రామకోటేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీధరరావు, ఉమామహేశ్వరరావు, చేబ్రోలు శ్రీనివాసరావు, లక్ష్మీ ప్రసన్న, రమ్య తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

మండల పరిధిలోని ఓలేరు పల్లెపాలెంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం అమ్మకేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 130 మందికి దుప్పట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు దుర్గారావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్, మండల కార్యదర్శి సుధాకర్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీ, ఆదిలక్ష్మి, వెంకటలక్ష్మి, డీవైఎఫ్ఐ నాయకులు కె.లక్ష్మణరావు, గోపి, జె.ధర్మరాజు, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

ఆహారం, తాగునీరు అందజేత

కర్లపాలెం, సెప్టెంబరు 11 : విజయవాడలోని సింగ్‌నగర్ వరద ప్రభావిత ప్రాంతంలో కర్లపాలెం పంచాయతీకి చెందిన టీడీపీ మైనార్టీ నాయకుడు, మాజీ కో ఆప్షన్ సభ్యుడు షేక్ బాషా సహకారంతో 500 మందికి ఆహారం, తాగునీటిని తరలించేందుకు బుధవారం తరలివెళ్ళారు. మాజీ జడ్పీటీసీ గుంపుల కన్నయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచనలు, ఎమ్మెల్యే నరేంద్రవర్మ ఆదేశాల మేరకు ఆహారం, మంచినీళ్ళను అదించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్ బాషా, వార్డుమెంబర్ జానీ, షేక్ ఇబ్రహీం పాల్గొన్నారు.

రైతులకు జరిగిన నష్టం పూడ్చలేనిది

● ఏపీ కౌలు రైతు సంఘం నాయకులు

కొల్లూరు, భట్టిప్రోలు, సెప్టెంబరు 11 : కృష్ణానదికి వచ్చిన వరదలతో లంక గ్రామాల్లో రైతులు తమ పంటలను పూర్తిగా కోల్పోయారని, వారిని ప్రభుత్వమే ఆదుకోవాలని ఏపీ కౌలు రైతు సంఘం డిమాండ్ చేసింది. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర బృందం బుధవారం లంక గ్రామాల్లో పర్యటించింది. స్థానిక రైతులతో చర్చించి జరిగిన నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని లంక గ్రామాల్లో రైతులు సాగు చేసిన వాణిజ్య పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులు అప్పుల ఊబిలోకి కూరుకుపోయారని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి హరిబాబు మాట్లాడుతూ, లంక గ్రామాల్లో రైతుల కంటే ఎక్కువగా కౌలు రైతులే నష్టపోయారన్నారు. ప్రభుత్వం ఈక్రాప్ నమోదుతో సంబంధం లేకుండా క్షేత్రస్థాయి పరిశీలన చేసి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య, రైతు సంఘం నాయకులు బిఎల్‌కె ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.



లంక గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఏపీ కౌలు రైతు సంఘ నాయకులు

వరద బాధిత ప్రజలను ఆదుకోవాలి : సీపీఎం

వేమూరు, సెప్టెంబరు 11 : కృష్ణానది పరివాహక ప్రాంతంలో వరదకు దెబ్బతిన్న ప్రజానీకాన్ని కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నాయకులు కేంద్ర బృందాన్ని కోరారు. వేమూరులో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొన్న కేంద్ర బృంద సభ్యులకు వినతిపత్రం సమర్పించిన నాయకులు మాట్లాడుతూ వరదలో లంక గ్రామాల్లో 90 శాతానికి పైగా ఇళ్ల నీట మునిగి కోట్లాది రూపాయలు పంట నష్టం జరిగిందని తెలిపారు. రైతులు, కౌలు రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాలు, డ్వాక్రా రుణాలు రద్దు చేయాలన్నారు. వరద నీటిలో మునిగిన ప్రతి ఇంటికి రూ.25 వేల ఆర్థిక సహాయం అందించాలని, పడిపోయిన ఇళ్ల స్థానంలో ప్రభుత్వమే పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. పెరిగిన సాగు ఖర్చులకు అనుగుణంగా ప్రతి ఎకరాకు (కంద, పసుపు, అరటి, తమలపాకు) లక్ష రూపాయలు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య, పార్టీ నాయకులు టి.కృష్ణమోహన్, వి.వెంకట్రామయ్య, నాగ మల్లేశ్వరరావు, బి.ఎల్.కె.ప్రసాద్, పి.మనోజ్‌కుమార్, బి.సుబ్బారావు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పశువుల పాక దగ్ధం

బాపట్ల రూరల్, సెప్టెంబరు 11 : విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వలన పశువుల పాక దగ్ధమైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... బాపట్ల మండలం నందిరాజుతోట గ్రామానికి చెందిన కర్రి నాగేశ్వరరావుకి సంబంధించిన పశువుల పాక షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదానికి గురైంది. బాపట్ల ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావుకు సమాచారం అందించటంతో ఫైరింజన్ ద్వారా ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.80 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

అవనిగడ్డ, సెప్టెంబరు 11: రేపల్లెకు చెందిన మన్నె పూర్ణచంద్రరావు(70) మోపిదేవి వెళ్లివస్తానని నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడని, బుధవారం కృష్ణానది వద్ద దక్షిణ చిరువోలులంకలో పూర్ణచంద్రరావు మృతదేహాన్ని గుర్తించినట్లు కుమార్తె రూప శ్రీ తెలిపారు. పూర్ణచంద్రరావుకు భార్య ఉమాదేవి, కుమార్తె రూపశ్రీ ఉన్నారు. కొంతకాలంగా ఆయన ఆరోగ్య పరిస్థితి సరిగా లేదని వారు తెలిపారు. స్థానిక పోలీసుల దక్షిణ చిరువోలులంక వద్ద దహన సంస్కారాలు పూర్తి చేశారు.

సాగు జోరు

జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు సాగుచేస్తున్న పత్తి, పొగాకు, కందితో పాటు కూరగాయల పైర్లు కళకళలాడుతున్నాయి. నెలరోజుల క్రితం వర్షాభావంతో కొట్టుమిట్టాడిన రైతన్నలు ఇటీవల కురిసిన వర్షానికి పైర్లు కోలుకోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. పశ్చిమ ప్రాంతంలో అధికంగా ప్రస్తుతం పత్తి పంట వేయగా అది ఏపు మీద ఉంది. తూర్పు ప్రాంతంలో శనగ, పొగాకు సాగుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. గుండ్లకమ్మతోపాటు, చిన్నచిన్న వాగులు వంకలలో నీళ్లు పారాయి. ఇటీవల కురిసిన వర్షానికి చెరువులకు నీరు రావడంతో భూగర్భజలాలు పెరిగాయి. రైతన్నలు పైర్లలో కలుపు తీయించుకోవడం, బలం మందు పెట్టుకోవడం వంటి పనులలో నిమగ్నమయ్యారు.

వ్యవసాయ పనులు ముమ్మరం

ఉపకరించిన ఇటీవల వర్షాలు

పశ్చిమాన మిర్చి, పొగాకు నాట్లు ప్రారంభం

నీటి వనరుల కింద వరి నారుమళ్లు

కళకళలాడుతున్న మెట్ట పైర్లు

వారం రోజుల్లో 27వేల హెక్టార్లకుపైగా విస్తీర్ణంలో పంటల సాగు

-మార్కాపురం మండలంలో 5వేల ఎకరాలకుపైగా పత్తి పంటను సాగు చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షం ముఖ్యంగా పత్తి పైరుకు బలాన్ని చేకూర్చింది. ఏ గ్రామంలో చూసినా పత్తి పైరు కళకళలాడుతోంది. పత్తితోపాటు పొగాకు, మిరప, కూరగాయల తోటలను సాగు చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి మండలంలోని కోలభీమునిపాడు, పెద్దనాగులవరం, తిప్పాయపాలెం గ్రామాలతో పాటు మరికొన్ని గ్రామాల చెరువులకు నీళ్లు వచ్చాయి. వాగులు, వంకలు జలకళను సంతరించుకున్నాయి.

-కొండపి నియోజకవర్గంలో వారంరోజుల క్రితం తేలికపాటి వర్షాలు పడ్డాయి. ప్రస్తుతం ఎండ తీవ్రంగా కాస్తోంది. దీంతో రైతులు పదును చూసుకుని వచ్చేనెలలో పొగాకు, శనగ పైర్లు సాగు చేసుకునేందుకు ప్రస్తుతం దుక్కులు దున్నుకుంటున్నారు. పొలాలను ఆయా పైర్లు వేసేందుకు అనువుగా సిద్ధం చేసుకుంటున్నారు. కాగా తొలకరి వర్షాలకు సాగు చేసిన నువ్వు పంటను కొందరు రైతులు దున్నేసుకోగా, కొందరు ప్రస్తుతం కోసి కుప్పలు పెడుతున్నారు. ఎండిన వాటిని విత్తనాలు రాల్చుకుంటున్నారు.

ఒంగోలు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి)/మార్కాపురం రూరల్/కొండపి: జిల్లావ్యాప్తంగా వ్యవసాయ పనులు ముమ్మరమయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలు అందుకు ఉపకరించాయి. అప్పటికే వేసి ఉన్న మెట్ట పైర్లు ప్రస్తుతం కళకళలాడుతున్నాయి. కొత్తగా పంటల సాగు జోరందుకుంది. గడిచిన వారం రోజుల్లోనే దాదాపు 27వేల హెక్టార్లలో అదనంగా పంటలు సాగయ్యాయి. ప్రధానంగా పశ్చిమప్రాంతంలో మిర్చి, పొగాకు నాట్లు ఊపందుకొన్నాయి. నీటి వనరుల కింద అక్కడక్కడా వరినాట్లు వేస్తున్నారు. అలాగే వరి నారుమళ్లను సిద్ధం చేయడంతోపాటు ఇతర మెట్ట పైర్ల సాగుకు రైతులు భూములు సిద్ధం చేస్తున్నారు. ఇలా పొలం పనుల్లో అందరూ బిజీ అయ్యారు.

ఇటీవల వరకు వర్షాభావం..

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సాగు ముందుకు సాగలేదు. అవసరమైన స్థాయిలో వర్షం లేక ఈ పరిస్థితి ఏర్పడింది. జూన్ నుంచి సెప్టెంబరు వరకు ఖరీఫ్ సీజన్ కాగా ఆ సమయంలో జిల్లాలో 2.02 లక్షల హెక్టార్లలో పంటలు వేస్తారు. అందులో అత్యధికంగా 73వేల ఎకరాలలో కంది, 31,562 హెక్టార్లలో పత్తి ఉంటుంది. మిగిలిన వాటిలో సజ్జ, నువ్వు, మిర్చి, వరి ప్రధానమైనవి. కాగా ఈ ఏడాది ప్రతికూల వాతావరణంతో పంటల సాగు ముందుకు కదలేదు. ఆగస్టు ఆఖరు నాటికి సాధారణంగా సుమారు 1.50లక్షల హెక్టార్లలో పంటలు సాగు కావాల్సి ఉండగా ఈ ఏడాది కేవలం 62,530 హెక్టార్లలో (31శాతం) మాత్రమే పంటలు సాగయ్యాయి. ఇక ఈ ఏడాది ఖరీఫ్‌కు కరువు కాటు తప్పదన్న ఆందోళన రైతుల్లో కనిపించింది.


పశ్చిమ ప్రకాశంలో సాగు చేస్తున్న రైతు, కూలీలు

రెండు రోజుల్లో 95.మి.మీ సగటు వర్షపాతం

పంటల సాగుపై రైతుల్లో ఆశలు మోడువారుతున్న సమయంలో ఈనెల ఆరంభంలో భారీ వర్షాలు కురిశాయి. రెండు, మూడు రోజుల వ్యవధిలో ఇంచుమించు 95మి.మీ. సగటు వర్షపాతం జిల్లాలో నమోదైంది. తీవ్ర వర్షాభావం ఎదుర్కొంటున్న పశ్చిమప్రాంతంలో భారీ వర్షాలే కురిశాయి. వాగులు, వంకలు, చెరువుల్లోకి నీరు చేరింది. మరోవైపు సాగుకు సాగర్ నీరు విడుదలైంది. ఈ పరిణామాలు రైతుల్లో మళ్లీ ఆశలను చిగురింపజేశాయి. దీంతో పొలం పనులకు ఉపక్రమించారు. ప్రధానంగా పశ్చిమప్రాంతంలో మిర్చి నాట్లు జోరుగా సాగుతున్నాయి. ఎర్రనేలల్లో పొగాకు నాట్లు ప్రారంభమయ్యాయి. సాగర్ ఆయకట్టులో వరిసాగుకు నార్లు పోస్తుండగా బోర్ల నీరు అవకాశం ఉన్న ప్రాంతంలో వరినాట్లు కూడా వేస్తున్నారు. అలా గత వారం రోజుల్లో సుమారు 27వేల హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి.

89,706 హెక్టార్లలో పంటల సాగు

ఈ సీజన్‌లో ఇప్పటివరకూ సుమారు 89,706 హెక్టార్లలో పంటలు సాగు చేసినట్లు సమాచారం. ఇంకా మెట్ట పైర్లు వేసేందుకు వీలుగా పలు ప్రాంతాల్లో రైతులు దుక్కులు సిద్ధం చేస్తున్నారు. తాజా వర్షాలు పొలంలో ఉన్న పైర్లకు బాగా మేలు చేశాయి. ప్రధానంగా వాడుముఖం పట్టిన సజ్జ, కంది, పత్తి, మొక్కజొన్న ఇతరత్రా పైర్లు జీవంపోసుకొని కళకళలాడుతున్నాయి. రానున్న వారంపది రోజుల్లో మరింత విస్తారంగా పంటలు సాగు జరగనుంది.

ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తే చర్యలు

మూడు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ స్వాధీనం


ఇసుక తవ్వే ప్రదేశంలో తహసీల్దార్ పార్వతి, ఎస్సై వెంకటేశ్వర్లు

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 11 : మండల పరిధిలోని పందిళ్లపల్లి సర్వే నెంబరు 102బై1 సొన పోరంబోకులో ఇసుక అక్రమ తవ్వకాలను అధికారులు అడ్డుకున్నారు. మూడు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌తో ఇసుక తవ్వకాలు చేస్తున్న నేపథ్యంలో తహసీల్దార్ పార్వతి, ఎస్సై వెంకటేశ్వర్లు సిబ్బందితో కలసి అడ్డుకున్నారు. వాటిని వేటపాలెం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ ఇసుక తవ్వకాలు, రావాణాకు సంబంధించి ప్రజలు తమ వంతు సహకారం అందించాలన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

14న జిల్లా బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

మేదరమెట్ల, సెప్టెంబరు 11 : ప్రకాశం జిల్లా బాలుర అండర్-14 క్రికెట్ జట్టు ఎంపిక ఈనెల 14వ తేదీన ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతుందని పీడీ సీఈ కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం రావినూతలలోని క్రికెట్ స్టేడియంలో జరిగిన విలేకరుల సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ వర్షాల కారణంగా ఉ మ్మడి ప్రకాశం జిల్లా బాలుర అండర్-14 జట్టు ఎంపిక వాయిదా పడిందన్నారు. ఈనెల 14వ తేదీ ఉదయం 9 గంటలకు ఒంగోలు మంగమూరు రోడ్డులోని అసోసియేషన్ సబ్ సెంటర్ నెట్స్‌లో జరుగుతాయని నాగేశ్వరరావు తెలిపారు. ఇక్కడ ఎంపికైన జట్లు అక్టోబరు 1వ తేదీ నుంచి కడప, అనంతపురంలో జరిగే ఆంధ్ర క్రికెట్ ఆధ్వర్యంలో జరిగే అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలో పాల్గొంటారని తెలిపారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు తప్పనిసరిగా వైట్ డ్రస్, షూష్, సొంత కిట్‌తో పాటు జనన ధ్రువీకరణ పత్రం (ఫారం-5), ఆధార్ కార్డు, స్కూల్ స్టడీ సర్టిఫికెట్‌తో హాజరు కావాలన్నారు. బాలుర అండర్ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు 1-9-2010 తరువాత జన్మించి ఉండాలన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు పూర్తి వివరాల కోసం కోచ్ సుధాకర్, బి.చంద్రశేఖరం మొబైల్ నెంబర్లు 9701088333, 9246222999కు ఫోన్ చేసి సంప్రదించాలని నాగేశ్వరావు తెలిపారు.

గాయపడిన ఉపాధ్యాయుడు మృతి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 11: రోడ్డు ప్రమాదంలో గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయుడు బుధవారం సాయంత్రం మృతి చెందారు. ఒంగోలు సమపంలోని ముక్తినూతలపాడుకు చెందిన జి.అచ్యుత్‌కుమార్ (50) రెండు సంవత్సరాలుగా అద్దంకి మండలంలోని కుంకుపాడు గ్రామం లో ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పని చేస్తున్నారు. ఈనెల 6వ తేదీన ఒంగోలు నుంచి కుంకుపాడు పాఠశాలకు బైక్‌పై వస్తూ మోదేపల్లి బ్రిడ్జి వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. గాయపడిన అచ్యుత్‌కుమార్‌ను మోదేపల్లి, అద్దంకి సీహెచ్‌సీ వైద్యశాలలో చికిత్స అనంతరం ఒంగోలులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. ఆయన్ని విజయవాడ మణిపాల్ ఆసుపత్రికి తీసుకువెళ్లాలని చెప్పడంతో బంధువులు బుధవారం సాయంత్రం అక్కడకు తీసుకువెళ్లగా మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. అచ్యుత్‌కుమార్ మృతి పట్ల సీఆర్పీ రమేష్, ఏపీటీఎఫ్ అద్దంకి మండల శాఖ సభ్యులు సంతాపాన్ని తెలియజేశారు.

యువకుడి ఆత్మహత్య

అద్దంకి, సెప్టెంబరు 11 : అద్దంకి పట్టణంలోని సాయిబాబా గుడి ప్రాంతంలో నివాసముంటున్న యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. లక్ష్మీనారాయణ (26) పట్టణంలోని సాయిబాబా గుడి సమీపంలో ఒంటరిగా ఉంటున్నాడు. తల్లిదండ్రులు విజయవాడలో ఉంటుండగా లక్ష్మీనారాయణ ఇక్కడి టీస్టాల్‌లో పనిచేస్తున్నాడు. సొంతంగా వ్యాపారం చేయాలనే ఉద్దేశంతో అతను కొద్ది రోజులుగా టీస్టాల్‌లో పనికి కూడా వెళ్లడం లేదని తెలిసింది. బుధవారం సాయంత్రం ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ ఖాదర్‌బాషా ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

జీజీహెచ్‌లో భార్య డ్యూటీ చేస్తున్న భర్త


భార్య స్థానంలో డ్యూటీ చేస్తున్న డాక్టర్ బాషా

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 11: ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో వైద్యం విడ్డూరంగా మారింది. విధుల్లో ఉండాల్సిన మహిళా డాక్టర్ స్థానంలో ఆమె భర్త విధులు నిర్వర్తిస్తున్నారు. పైపెచ్చు వైద్య కోసం వచ్చిన వారి పట్ల శ్రద్ధ చూపకపోగా, కఠినంగా వ్యవహరించడంపై రోగులు మండిపడుతున్నారు. ఈక్రమంలో బుధవారం చోటుచేసుకున్న ఘటనపై ప్రజాసంఘాలు సూపరింటెండెంట్‌కు డాక్టర్ దుర్గాదేవికి ఫిర్యాదు చేశారు. రిమ్స్ క్యాజువాలిటీలో మధ్యాహ్నం డ్యూటీ చేయాల్సిన డాక్టర్ నజ్మా ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యసేవలు అందిస్తుండగా, ఆమె భర్త డాక్టర్ బాషా విధులు నిర్వర్తించడం విమర్శలకు తావిస్తోందన్నారు. దీనిపై స్పందించిన సూపరింటెండెంట్ మహిళా డాక్టర్ నజ్మా డ్యూటీని ఆమె భర్త బాషా చేస్తున్న విషయాన్ని గుర్తించానని, ఈ విషయమై చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు.

రైలు నుంచి జారి పడి విద్యార్థి మృతి

కురిచేడు, సెప్టెంబరు 11 : మండలం వెంగాయపాలెం సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన ఓ యువకుడు రైలు నుంచి జారి పడి మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. నంద్యాల జిల్లా దర్రిపాడు మండలం గోగిదిన్నె గ్రామానికి చెందిన పెద్దిబోయిన ఉదయ్‌కిరణ్ (18) గుంటూరులోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం రాత్రి అతడు నంద్యాల నుంచి గుంటూరుకు రైలులో బయలుదేరాడు. గుంటూరు- గుంతకల్ రైలు మార్గంలో కురిచేడు సమీపంలో 104/4 కిలోమటరు సమీపంలో ఉదయ్‌కిరణ్ రైలు నుంచి జారి కింద పడ్డాడు. తీవ్ర గాయాలవడంతోపాటు రైల్వే ట్రాక్ పక్కనే గడ్డితో ఉన్న గుంతలో పడిపోయాడు. బుధవారం ఉదయం ఆ దారిని వెళ్లే వారు గమనించి అతడిని ట్రాక్టర్‌లో కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. అక్కడ వైద్య సిబ్బంది ప్రాథమిక వైద్యం అందించారు. కొద్ది సేపటికే ఉదయ్‌కిరణ్ మృతి చెందాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు వచ్చి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మహిళ అదృశ్యంపై కేసు

ముండ్లమూరు, సెప్టెంబరు 11 : మండలంలోని ఈదర గ్రామానికి చెందిన నాగమల్లి చంద్రకళ అనే మహిళ, ఆమె ఇద్దరు పిల్లలు ఈ నెల 5వ తేదీ నుంచి కన్పించడం లేదని ముండ్లమూరు పోలీసుస్టేషన్‌లో భర్త కొండగురవయ్య ఫిర్యాదు చేయగా ఎస్ఐ వై నాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదులో పేర్కొన్నారు.

60 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

పామూరు, సెప్టెంబరు 11 :మినీ టెంపో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 60 బస్తాల రేషన్ బియ్యాన్ని సీఐ భీమానాయక్ తన సిబ్బందితో మాటు వేసి పట్టుకొన్న సంఘటన మంగళవా రం రాత్రి చోటుచేసుకుంది. వాహనంలో రేషన్ బియ్యాన్ని అక్రమం గా తరలివెళ్తున్నాయన్న పక్కా సమాచారం పోలీసులకు అందింది. మినీ టెంపో వాహనాన్ని, అందులోని 60 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని స్టేషన్ కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌చార్జి ఎస్ఐ రాజేష్ తెలిపారు.

వైసీపీ నేత దగా

వ్యవసాయ పరికరాల పేరిట దాదాపు రూ.4 కోట్లు వసూళ్లు

ఏడాది నుంచి పూర్తిగా ఇవ్వని వస్తువులు

తాళ్లూరు, ముండ్లమూరు మండలాల రైతుల గగ్గోలు

ఎస్పీ దామోదర్‌కు ఫిర్యాదు

విచారణ చేపట్టిన ముండ్లమూరు ఎస్సై



దర్శి, సెప్టెంబరు 11 : వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు కొంతమంది ప్రజలను ఎన్ని రకాలుగా మోసం చేయాలో అన్ని రూపాల్లో దగా చేసి కోట్లాది రూపాయలు జేబులో వేసుకున్న సంఘటనలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. మొన్నటి ఎన్నికల్లో జగన్ ప్రభుత్వం పోయి టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వారి అవినీతి, అక్రమాలకు మోసపోయిన వారు ధైర్యంగా బయటకొచ్చి ఆ మోసాన్ని చెబుతున్నారు. ఆ వివరాలేంటో చూద్దాం.. తాళ్లూరు మండలానికి చెందిన వైసీపీ నాయకుడు నాగార్జునరెడ్డి ఐటీసీ కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కొందరు రైతులకు ఐటీసీ ద్వారా సబ్సిడీపై సగం ధరకు ట్రాక్టర్లు, ఇతర పనిముట్లు ఇప్పిస్తానని ఊరూరా ప్రచారం చేశాడు. తొలుత కొందరి రైతులు వద్ద డబ్బులు తీసుకొని చెప్పిన ప్రకారం ట్రాక్టర్లు, పనిముట్లు తెచ్చి ఇచ్చాడు. ఒక కంపెనీ ద్వారా ట్రాక్టర్లు కొనుగోలు చేసి రైతులకు ఇచ్చి ఐటీసీ సంస్థ ద్వారా తెచ్చానని తెగ ప్రచారం చేశాడు. దీంతో చాలా మంది రైతులు నమ్మి అతనికి డబ్బు ఇచ్చారు.

ఐటీసీ సంస్థ బ్రాండ్‌తో వసూళ్లు ఇలా...

దేశవ్యాప్తంగా ఐటీసీ సంస్థకు మంచి పేరు ఉండటంతో ఆ నమ్మకమే అతను మోసానికి పునాదిగా వాడుకున్నాడు. దీంతో వందలాది మంది రైతులు ట్రాక్టర్లు, పనిముట్ల కోసం నాగార్జునరెడ్డికి డబ్బులు ఇచ్చారు. అప్పుడప్పుడు ఒక్కో ఊరిలో ఒకరికి ట్రాక్టర్, కొన్ని పరికరాలు కొనుగోలు చేసి ఇస్తూ మిగిలిన వారికి ఎరవేశాడు. దీంతో చాలా మంది డబ్బులు కట్టారు. ఆ క్రమంతో సకాలంలో పరికరాలు ఇవ్వకపోవడంతో గట్టిగా అడిగిన వారికి అదిగో వస్తున్నాయ్, ఇదిగో వస్తున్నాయ్ అంటూ వాయిదాలు చెబుతూ వచ్చాడు. ఈ వ్యవహారం గత మూడేళ్ల కాలంలో జోరుగా జరిగింది. కొంత మంది రైతులకు ట్రాక్టర్లు పరికరాలు అందించటంతో మిగిలిన వారు కొద్ది రోజుల తర్వాతైనా వస్తాయన్న ఆశతో ఎదురు చూశారు. డబ్బులు చెల్లించి ఏడాది దాటినప్పటికీ సరైన సమాధానం చెప్పకుండా సాకులు చెబుతున్నాడు. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అధికారులకు ఫిర్యాదు చేసినా ఉపయోగం ఉండదని మౌనం వహించిన రైతులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో కొద్దిరోజుల క్రితం ముండ్లమూరు మండలానికి చెందిన టి. నారాయణరెడ్డి, మరికొందరు రైతులు జిల్లా ఎస్పీ దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. రైతుల ఫిర్యాదు మేరకు విచారణ జరిపి న్యాయం చేయాలని ఎస్పీ దామోదర్ డీఎస్పీ లక్ష్మీనారాయణను ఆదేశించారు.

విచారణలో ఒప్పుకున్న నిందితుడు

కొందరు బాధిత రైతులు డీఎస్పీ లక్ష్మీనారాయణను కలిసి వసూళ్ల దందాను వివరించారు. ఆయన వెంటనే ముండ్లమూరు ఎస్సై నాగరాజుకు విచారణ చేయాలని ఆదేశించారు. ఆ మేరకు రైతులకు ముండ్లమూరు ఎస్సైను కలిసి పరిస్థితిని వివరించారు. ఎస్సై వెంటనే ఆరోపణలు ఎదుర్కొంటున్న నాగార్జునరెడ్డిని పిలిపించి మాట్లాడారు. తాను ట్రాక్టర్లు, రొటావేటర్లు, ట్రక్కులు, ఇతర వ్యవసాయ పరికరాలు సబ్సిడీపై సగం ధరకు ఇప్పిస్తానని డబ్బులు తీసుకున్న మాట వాస్తవమేనని విచారణలో నాగార్జునరెడ్డి అంగీకరించాడు. తనకు కొంత గడువు ఇస్తే రైతులు వద్ద తీసుకున్న సొమ్ము తిరిగి చెల్లిస్తానని చెప్పినట్లు సమాచారం. ఇలా సుమారు రూ.4 కోట్లు వసూలు చేసినట్లు బాధితులు చెబుతున్నారు. అధికారులు తమ సొమ్ము వీలైనంత త్వరగా ఇప్పించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

చచ్చినా చావే !

రావిపాడులో శ్మశానానికి వెళ్లాలంటే గుండ్లకమ్మ దాటాల్సిందే

5 సంవత్సరాల వైసీపీ పాలనలో పట్టించుకోని పాలకులు


వాగు నుంచి శవాన్ని మోసుకుని శ్మశానానికి వెలుతున్న గ్రామస్థులు

కంభం, సెప్టెంబరు 11 : వృద్ధాప్యంతోనో, మరే ఇతర కారణాలతో కాలం చేస్తే ఆ గ్రామస్థులు శ్మశానానికి మృతదేహాన్ని మోసుకెళ్లాలంటే బతికినోళ్ల చావుకు వస్తుందని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని రావిపాడు గ్రామంలో కిలోమీటరు అవతల ఊరికి దూరంగా శ్మశానం ఉంది. గ్రామానికి, శ్మశానానికి మధ్యలో గుండ్లకమ్మవాగు ఉంది. ఎవరైనా చనిపోతే శ్మశానానికి తీసుకెళ్లాలంటే వేసవి, శీతాకాలంలో ఎలాంటి సమస్య ఉండదు. వర్షాకాలంలో మాత్రం గుండ్లకమ్మ వాగు నిండుగా ప్రవహిస్తూ ఉంటుంది. వాగుపారే సమయంలో ఎవరైనా మరణిస్తే శ్మశానానికి ఎలా వాగుదాటాలా అని ఆందోళన చెందుతుంటారు. నడుముల పైకి పారుతున్న గుండ్లకమ్మ వాగులోకి దిగి భుజంపై పాడెను మోస్తూ జాగ్రత్తగా తీసుకెళ్ళాల్సి వస్తోంది. చివరి చూపు చూసేందుకు బంధువులు, మహిళలు, పిల్లలు వాగు దాటలేని పరిస్థితి. వాగు అవతల ఒక్క శ్మశానమేకాక రైతుల పొలాలు కూడా ఉన్నాయి. వాగు ఉధృతంగా పారే సమయంలో పొలాలకు వెళ్లలేని పరిస్థితి. గ్రామసమస్యను తీర్చాలంటూ గత వైసీపీ పాలనలో నాయకులు, అధికారుల దృష్టికి ఎన్నిమార్లు తీసుకెళ్లినా ఫలితం లేదని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా స్పందించి వాగుపై చప్టాను నిర్మించేందుకు నిధులు మంజూరయ్యేలా కృషి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విజయవాడ వరద బాధితులకు
రూ.47.16 లక్షలు అందజేత



విరాళం చెక్కును సీఎంకు అందజేస్తున్న లక్ష్మి, సాగర్ దంపతులు

దర్శి, సెప్టెంబరు 11 : విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు బుధవారం సాయంత్రం సీఎం చంద్రబాబుకు రూ.47.16200 లక్షల చెక్కును అందజేశారు. నియోజకవర్గంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు, దాతలు అందించిన విరాళం రూ.37,16200 లక్షలు, డాక్టర్ లక్ష్మి దంపతులు రూ.10 లక్షలు కలిపి సీఎంకు అందించారు. ఈ సందర్భంగా తుఫాన్ బాధితుల కోసం భారీగా విరాళాలు సేకరించినందుకు సీఎం చంద్రబాబు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, తాళ్లూరు ఎంపీపీ శ్రీనివాసరావు, దర్శి నగర పంచాయతీ చైర్మన్ పిచ్చియ్య, ముండ్లమూరు, దొనకొండ, తాళ్లూరు, కురిచేడు మండలాల పార్టీ అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు, నాగులపాటి శివకోటేశ్వరరావు, ఓబుల్‌రెడ్డి, నెమలయ్య పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ1,22,700 విరాళం

తాళ్లూరు, సెప్టెంబరు 11 : విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు తూర్పుగంగవరం గ్రామ టీడీపీ కమిటీ ఆధ్వర్యంలో సేకరించిన విరాళాలను గ్రామ టీడీపీ అధ్యక్షుడు కనిశెట్టి రామలక్ష్మయ్య బుధవారం దర్శిలో మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్యకు అందజేశారు. దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి సూచనతో గ్రామ టీడీపీ కమిటీ గ్రామంలో విరాళాలు సేకరించారు. సేకరించిన రూ.1,22,700లను టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి ద్వారా సీఎం సహాయనిధికి అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామటీడీపీ ఎస్సీ సెల్ నేత చాట్లడానీ పాల్గొన్నారు.

అద్దంకి ఆర్టీసీ గాడిలో పడేనా

క్రమేపీ రద్దవుతూ వచ్చిన సర్వీసులు

కార్మికులు, అధికారుల మధ్య కొరవడిన ఐక్యత

సిబ్బందిపై పెరిగిన కక్షసాధింపులు

నేడు హైదరాబాద్‌కు పాత బస్సుల స్థానంలో కొత్త సర్వీసులు ప్రారంభించనున్న మంత్రి రవికుమార్

అద్దంకి, సెప్టెంబరు 11 : అద్దంకి ఆర్టీసీ డిపో గతంలో ఒక వెలుగు వెలిగింది. రాష్ట్ర స్థాయిలో పలు విభాగాలలో ప్రథమ స్థానం సాధించింది. ప్రస్తుత పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. ఏటికేడు సర్వీసులు పెరగాల్సింది పోయి క్రమేపీ తగ్గుతూ వస్తున్నాయి. దీంతో డిపో పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. కార్మికులు, అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడు అద్దంకి డిపో లాభాల బాటలో నడిచింది. సిబ్బంది, ప్రయాణికుల సలహాలకు ప్రాధాన్యత ఇచ్చిన సమయంలో అన్నింటా ముందుంది. కొన్ని సంవత్సరాలుగా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. సఖ్యత లేకపోవడంతో పాటు అధికారుల ఏకపక్ష ధోరణి కారణంగా పలు సందర్భాలలో కార్మికులు తీవ్ర ఇబ్బంది పడ్డ పరిస్థితులు అనేకం చోటుచేసుకున్నాయని కార్మిక సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. ఓ మహిళా కండక్టర్ విధులు నిర్వహించలేనని, ఒకటిరెండు రోజులు సెలవు ఇవ్వాలని అధికారుల దృష్టికి తీసుకుపోగా విధులు నిర్వహించే సమయంలో పడిపోతే మినహా సెలవు ఇవ్వలేమని చెప్పడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. ఓ డ్రైవర్ ఆరోగ్యం బాగాలేదని సెలవు కోసం దరఖాస్తు చేసుకుంటే అధికారి వ్యాఖ్యానించిన తీరు కార్మికులందరిలో తీవ్ర కోపాన్ని తెప్పించింది. ఇవి చాలదన్నట్లు తరచూ పలు సర్వీసులు రద్దు చేస్తుండడంతో ఆయా రోజులలో విధులకు హాజరయ్యే డ్రైవర్‌లు, కండక్టర్‌లకు బలవంతపు సెలవు పెట్టుకోవాల్సిన పరిస్థితి అని పలువురు కార్మికులు వ్యాఖ్యానిస్తున్నారు. మిగిలిన ఏ డిపోలో లేని విధంగా అద్దంకి డిపోలో తరచూ ప్రీ ప్లాన్స్ క్యాన్సిలేషన్ (పీపీసీ) పేరుతో రద్దు చేస్తుండడంతో అటు ప్రయాణికులు, ఇటు కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. ఆదివారం సుమారు 10కి పైగా బస్ సర్వీసులు రద్దు చేస్తున్నారు. అద్దంకి డిపో లో గతంలో 80కిపైగా బస్సు సర్వీసులు ఉండగా, ప్రస్తుతం 62 సర్వీసులకు తగ్గిపోయాయి.

వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో నేతలు ఆర్టీసీ గురించి పట్టించుకోకపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో పలు సర్వీసులు రద్దు అయినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత బల్లికురవ, పంగులూరు మండలాల నేతలు ఆర్టీసీ బస్సులు రద్దు చేసిన విషయాన్ని మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. గురువారం అద్దంకి డిపోకు మంత్రి రవికుమార్ రానున్న నేపథ్యంలో అద్దంకి డిపోలో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకు వచ్చేందుకు పలువురు కార్మిక సంఘాల నేతలు సిద్ధమవుతున్నారు. మంత్రి రవికుమార్ ప్రత్యేక దృష్టి సారించి అద్దంకి డిపోను గాడిలో పెట్టి గత వైభవాన్ని తీసుకు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని కార్మికులు, ప్రయాణికులు కోరుతున్నారు.



ఎంపీడీవోకు డీడీని అందజేస్తున్న రాయల్ స్కూల్ ప్రతినిధులు రవీంద్రబాబు, మధుబాబు

సీఎం సహాయ నిధికి రూ.లక్షా20వేల విరాళం

మార్టూరు, సెప్టెంబరు 11 : విజయవాడలోని వరద బాధితులను ఆదుకునేందుకు తమ వంతు సాయంగా మార్టూరులోని రాయన్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి స్కూల్ యాజమాన్యం 1లక్షా 20వేల రూపాయలను వసూలు చేశారు. బుధవారం స్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పీ రవీంద్ర బాబు, సంస్థ ఇన్‌చార్జి కే మధుబాబు సీఎం సహాయనిధి పేరుతో 1లక్షా20 వేల డీడీని ఎంపీడీవో జీ నితిన్‌కు వారి కార్యాలయంలో అందచేశారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గో రక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

చీరాల, సెప్టెంబరు 11 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గో రక్షణ చట్టాల్ని పటిష్టంగా అమలు చేయాలని దైవజ్ఞాన సాధకుడు ఏ. కృష్ణరాజర్షి బుధవారం ప్రకటనలో కోరారు. సనాతన ధర్మం, సర్వజన క్షేమాన్ని కోరే హిందూ ధర్మ శాస్త్రాల సారాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుని ఆచరించాలన్నారు. ధర్మో రక్షతి, రక్షితః అన్న సూక్తిని ప్రతి ఒక్కరూ ఆచరించాల్సిన ఆవశ్యకతను ఆయన ఆ ప్రకటనలో వివరించారు.


కలిసొచ్చిన కాలం

- నిండుగా చెరువులు
- ముందస్తు గానే సాగుకు సిద్ధమైన అన్నదాతలు

అద్దంకి, సెప్టెంబరు 11 : కాలం కలిసి వచ్చి చెరువులు నిండుగా నిండాయి. వర్షాలకు తోడు సాగర్ కాలువలకు నీరు విడుదల కావడంతో ప్రతి ఏటా అక్టోబరులో నిండే చెరువులు ఈ ఏడాది ఆగస్టు చివరి వారం, సెప్టెంబరు మొదటి వారానికి పూర్తి స్థాయిలో నిండాయి. అద్దంకి నియోజకవర్గంలో పెద్ద చెరువులుగా ఉన్న భవనాసి, సంతమాగులూరు, ఏల్చూరు, కొప్పరం, ఈర్ల చెరువు, అంబడిపూడి, కలవకూరు, ధర్మవరం తదితర చెరువులు పూర్తి స్థాయిలో నిండాయి. దీంతో రైతులు ముందుగానే వరి సాగుకు సిద్ధం అయ్యారు. ముందస్తుగానే నార్లు పోసిన రైతులు ఇప్పటికే వరినాట్లు వేశారు. ముందుగానే నాట్లు వేస్తుండడంతో దీర్ఘకాల వరి వంగడాలు సాగుపై రైతులు దృష్టి పెట్టారు. మరి కొందరు రైతులు ప్రస్తుతం వరి నార్లు పోస్తున్నారు. అటు వర్షాలు సకాలంలో పడడం, ఇటు సాగర్ జలాలు విడుదల కావడంతో పాటు సాగర్ ఆయకట్టులో ఇంకా పూర్తి స్థాయిలో వరి నాట్లు ప్రారంభం కాకపోవడంతో చెరువులకు నీరు చేరి త్వరగా నిండాయి. దీంతో ఆయా చెరువుల ఆయకట్టు రైతులు నీటి కోసం ఎదురు చూసే అవసరం లేకుండా ముందస్తుగానే వరి సాగుకు సిద్ధమయ్యారు. అదే సమయంలో గుండ్లకమ్మ నదికి నీటి ప్రవాహం రావడంతో ఆయా గ్రామాల వద్ద ఉన్న ఎత్తిపోతల పథకాల ఆయకట్టు రైతులు కూడా ముందస్తుగానే వరి సాగుకు సిద్ధమవుతున్నారు.



నీటితో కళకళలాడుతున్న భవనాసి చెరువు





నీటితో నిండుగా ఉన్న సంతమాగులూరు చెరువు, చెరువు ఆయకట్టులో వేసిన వరి నాట్లు



బాలికలతో మాట్లాడుతున్న విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు

క్రమశిక్షణతోనే లక్ష్యాలను చేరుకోవాలి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 11 : క్రమశిక్షణతో చదివి మీ లక్ష్యాలను చేరుకోవాలని చీరాల డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి అబ్బురాజు శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలంలోని తిమ్మాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలోని హైస్కూల్ ప్లస్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆడపిల్లలగా చదువు ఆవశ్యకతను గురించి, తద్వారా పొందే ప్రయోజనాలను తెలియజేశారు. మంచి మార్కులు సాధించి మీ తల్లిదండ్రులకు, కళాశాలకు పేరు తేవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతి, నమోదుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంఈవో 2 బి.సుధాకరరావు, హెచ్‌ఎంలు పీ గంగాధరరావు, కేవీ శ్రీనివాసరావు, ఊటుకూరి శ్రీనివాసులు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

బూదవాడ విద్యార్థుల ప్రతిభ

పంగులూరు, సెప్టెంబరు 11 : మండల స్థాయిలో జరిగిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో బూదవాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. విద్యా వనరుల కేంద్రంలో బుధవారం వికసిత్ ఏపీ 2047 అనే అంశంపై వ్యాస రచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో వ్యాస రచనలో బూదవాడ పదవతరగతి విద్యార్థిని షేక్ సమీర ప్రథమ స్థానంలో నిలువగా, కొండమంజులూరు ఉన్నత పాఠశాలకు చెందిన పవన్ గోపీకృష్ణ ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నాడు. వక్తృత్వ పోటీలో బూదవాడ విద్యార్థి జి.మురళీకృష్ణ సాయిరామ్ ప్రథమ స్థానం, చందలూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని చల్లా గాయత్రి ద్వితీయ స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో ఎంఈవోలు కె.నాగభూషణం, జి.వీరాంజనేయులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

15లోగా ఈ-పంట నమోదు చేయాలి



కుంకుపాడులో ఈ పంట నమోదును పరిశీలిస్తున్న ఏవో

అద్దంకిటౌన్, సెప్టెంబరు 11: పంటలను సాగు చేస్తున్న రైతులు ఈ నెల 15వ తేదీలోపు ఈ-పంట నమోదును చేసుకోవాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకట కృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని కుంకుపాడు గ్రామంలో జరుగుతున్న ఈ-పంట నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. పంట నమోదైతేనే ఫసల్ బీమా వర్తిస్తుందని, గిట్టుబాటు ధర, బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ పథకాలు అందుతాయని తెలిపారు.

టోల్ గేట్ రుసుము పంచాయతీకి జమ

జీతభత్యాలు, అభివృద్ధి పనులకు వినియోగం

చీరాల, సెప్టెంబరు 11 : టోల్‌ప్లాజాలో వసూలైన నిధులను పంచాయతీ నిధులకు బుధవారం జమచేశారు. మండల పరిధిలోని వాడరేవు పంచాయతీ తీరప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ, గ్రామాభివృద్ధి పనులు, సిబ్బంది జీతభత్యాలకు నిధుల సమీకరణకు సంబంధించి కీర్తివారిపాలెం వద్ద ఏర్పాటు చేసిన టోల్ గేట్ వద్ద తొలి మూడు రోజులకుగాను రూ.17,300 వసూలయ్యాయి. ఆ నిధులు పంచాయతీకి జమ చేశారు. బుధవారం రూ.7,800 టోల్‌గేట్ ద్వారా వసూలయ్యాయి. ఆ నిధులను ముందుగా సిబ్బంది జీతభత్యాలకు, పారిశుధ్య పనులకు వినియోగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి మూడు రోజులకోసారి వసూలైన రుసుమును, పంచాయతీ నిధులకు జమ చేస్తూ పారదర్శకంగా నిధుల వినియోగం జరిగేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుగు అడుగులు వేస్తున్నట్లు తెలిపారు.

దాతల సహకారం అభినందనీయం

ఇంకొల్లు, సెప్టెంబరు 11 : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు తమ వంతు సహాయ సహకారాలను అందించడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయిని స్వర్ణ ప్రభావతి అన్నారు. ఇంకొల్లుకు చెందిన ప్రవాసాంధ్రుడు కరి సుబ్బారావు రాంనగర్ ప్రాథమిక పాఠశాలకు బుధవారం రూ.50వేల విలువైన బల్లలను అందజేసారు. ఈ సందర్భంగా దాత సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలనే ఆకాంక్షతో తమ వంతు సహాయసహకారాన్ని అందిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా సుబ్బారావును ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ లతీఫ్, ప్రధానోపాధ్యాయుడు షేక్ మస్తాన్‌వలి, శివరామకృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన ఉండాలి

చీరాలటౌన్, సెప్టెంబరు 11 : బాలల వారి హక్కులపై అవగాహన కలిగి ఉండాలని బాలల పరిరక్షణ విభాగం జిల్లా ప్రతినిధి స్వప్నప్రియ అన్నారు. బుధవారం చీరాల నీలం జేమ్స్ ఎయిడెడ్ స్కూల్, వేటపాలెం బాలకోన్నత ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా విద్యా హక్కులు, గుడ్ టచ్ - బ్యాడ్ టచ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే విద్యా ప్రామాణిక అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పోటీలతోనే లక్ష్య సాధన

ఎంఈవో సుబ్రహ్మణ్యేశ్వరరావు

చీరాలటౌన్, సెప్టెంబరు 11 : విద్యార్థులు పోటీల్లో పాల్గొనడం వలన లక్ష్యాలపై దృష్టి పెరుగుతుందని ఎంఈవో సుబ్రహ్మణ్యేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం మండల స్థాయి వికసిత్ ఏపీ-2047 భాగంగా 6-10 తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఎస్‌ఆర్‌అండ్‌పీఎం హైస్కూల్‌లో జరిగాయి. మొదటి బహుమతిని కేజీబీవీ చీరాల విద్యార్థి ఉన్నగిరి వెంకట అనిత, రెండవ బహుమతిని ఎస్‌ఆర్‌పీఎం హైస్కూల్ విద్యార్థి శివరామ్, మూడవ బహుమతిని కేజీఎంజీ విద్యార్థి యశ్విత సాయిలక్ష్మి, ఉపన్యాస పోటీల్లో మొదటి బహుమతిని కేజీబీవీ చీరాల విద్యార్థి రేవు హేమ, రెండవ బహుమతిని కేజీఎంజీ విద్యార్థి గీతాలక్ష్మి, మూడో బహుమతిని బీవీఅండ్‌బీఎన్ జాండ్రపేట విద్యార్థి రిషిక సాధించారు.

నిమజ్జనాల్లో జాగ్రత్తలు పాటించాలి

చీరాలటౌన్, సెప్టెంబరు 11 : భక్తులు సముద్ర తీరాల్లో నిమజ్జన సమయాల్లో జాగ్రత్తలు పాటించాలని రూరల్ సీఐ సత్యనారాయణ సూచించారు. సముద్రతీరంలో నిమజ్జనాలు పోటెత్తడంతో రాత్రి సమయంలో కూడా సీఐ గస్తీ విధులు నిర్వహించారు. ఎప్పటికప్పుడు భక్తులకు జాగ్రత్తలు చెప్తూ అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. సముద్రతీరంలో ప్రమాదాలు జరగకుండా అన్ని విధాలుగా సిబ్బందికి సూచనలు ఇచ్చామన్నారు. సీఐ వెంట రూరల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



రాత్రి సమయంలో తీరం వద్ద సీఐ సత్యనారాయణ



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ఇందిరమ్మ

చిరుధాన్యాలు, ఆకుకూరలు తినాలి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 11: రక్తహీనత రాకుండా చిరుధాన్యాలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.ఇందిరమ్మ అన్నారు. బుధవారం కలవకూరు సెక్టార్ పరిధిలోని శింగరకొండపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు రక్తహీనత, దాని నివారణకు తీసుకోవల్సిన ఆహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాగులు, బెల్లం తీసుకోవడం ద్వారా ఐరన్ వృద్ధి చెందుతుందన్నారు. కేంద్రంలో అందించే పాలు, గుడ్లు, బాల సంజీవని కిట్‌లను గర్భిణులు, బాలింతలు ఉపయోగించుకోవాలన్నారు. 3 సంవత్సరాల పిల్లలకు బాలామృతం, గుడ్లు, పాలు ఇవ్వాలని తద్వారా సంపూర్ణ ఆహారం అంది రక్తహీనతను నివారించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం ఎన్.ఏసమ్మ, ఎంఎల్‌పీహెచ్‌ఎం పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు వై.నాగమణి, పి.అల్లూరమ్మ, విశాలాక్షి, రమణ, అచ్చమ్మ పాల్గొన్నారు.

పంగులూరు : గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని కొరిశపాడు సీడీపీవో కృష్ణకుమారి అన్నారు. మండలంలోని రామకూరు గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది పౌష్టికాహార మాసోత్సవాన్ని నిర్వహించారు. తల్లులు ఆరోగ్యంగా ఉంటేనే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని కృష్ణకుమారి తెలిపారు. ఆహారంలో కూరగాయలు, ఆకుకూరలు క్రమం తప్పకుండా తీసుకోవాలని ముప్పవరం సెక్టార్ సూపర్‌వైజర్ పద్మజ సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తులసి, అరుణ, అనూరాధ, సుజాత, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

పర్చూరులో

బోడవాడ(పర్చూరు) : గర్భిణులు, బాలింతలు తప్పక పోషకాహారం తీసుకోవాలని తద్వారా పుట్టబోయే బిడ్డతోపాటు తల్లి కూడా ఆర్యోంగా ఉంటుదని సీడీపీవో సుభద్ర అన్నారు. బుధవారం పర్చూరు మండలంలోని బోడవాడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీవోమాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

కారంచేడులో

కారంచేడు గ్రామంలో బుధవారం గర్భిణీలు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్‌లు, హిమబిందు, సుమలత, కార్యకర్తలు పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేయాలి



విత్తనశుద్ధి కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏవో కుమారి

బల్లికురవ, సెప్టెంబరు 11 : రైతులంతా సేంద్రియ పద్ధతి ద్వారా పంటలు సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ శాఖ ఏవో కుమారి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని చెన్నుపల్లి గ్రామంలో ఈమని నాగరాజు అనే రైతు రసాయన ఎరువులు, పురుగు మందులు లేకుండా సేంద్రియ పద్ధతిలో వరి సాగును ఏవో పరిశీలించారు. బీజామృతం ద్వారా చేపడుతున్న విత్తనశుద్ధి కార్యక్రమాన్ని ఏవో చూసి రైతులకు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కూడా సేంద్రియ వ్యవసాయానికి అధిక ప్రాధాన్యతను ఇస్తుందని రైతులు పంటల సాగుకు గ్రామాలలో అందుబాటులో ఉండే వస్తువుల ద్వారా సేంద్రియ ఎరువులను తయారు చేసుకోవాలన్నారు. గ్రామాలలో ఉన్న రైతు సేవా కేంద్రాలలో వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో వీఏఏ శ్రీనివాస్, రైతులు వీరబాబు పాల్గొన్నారు.

రాతి మండపానికి విరాళం

అద్దంకి, సెప్టెంబరు 11 : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలంయంలో రాతి ముఖ మండపం నిర్మాణానికి ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం కొలచనకోటకు చెందిన బత్తిని ప్రసాద్, నిర్మల దంపతులు 2,25,116 రూపాయలను బుధవారం ఈవో, అసిస్టెంట్ కమిషనర్ సుభద్రకు అందజేశారు. బత్తిని వెంకటప్పయ్య, బుల్లెమ్మ జ్ఞాపకార్థం కుమారుడు ప్రసాద్ కుటుంబసభ్యులతో కలిసి వచ్చి విరాళాన్ని అందజేశారు.



ఈవో నుంచి రసీదును అందుకుంటున్న దాతలు

వైసీపీ పాలకుల పాపాలు.. నేడు శాపాలు

టీడీపీ కూటమి నాయకుల ఆవేదన

చీరాల, సెప్టెంబరు 11 : గత వైసీపీ పాలకులు చేసిన పాపాలు, నేడు శాపాలుగా మారాయని పలువురు కూటమి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జగన్‌రెడ్డి హయాంలో ఈపురుపాలెం తదితర ప్రాంతాల్లో జరిగిన ఇసుక అక్రమ తవ్వకాలతో కరకట్టలు కరిగిపోయాయన్నారు. ఆ పాపం నేడు అనుభవించాల్సి వస్తోందన్నారు. ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఎన్నికలకు ముందు చీరాల వచ్చినప్పటి నుంచి నేటి వరకు పారదర్శకమైన అడుగులు వేస్తున్నారన్నారు. విజయవాడ వరదల నేపథ్యంలో జక్కంపూడిలో వరదబాధితుల సహాయార్థం ఎమ్మెల్యే కొండయ్య, ఇతర నాయకులు తమ సేవలు అందిస్తుంటే, ఎమ్మెల్యేకు మంచి పేరు వస్తుందనే అక్కసుతో అధికారుల బదిలీల విషయంలో అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. వాస్తవాలు ఉంటే నిగ్గు తేల్చాలన్నారు. అలా నిరూపిస్తే తాను రాజకీయాలను శాశ్వతంగా వదిలేస్తానని జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి గూడూరి శివ రామప్రసాద్ అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు, సౌకర్యాలు కల్పించేందుకు చేపడుతున్న పనులను సానుకూల దృక్పథంతో చూడాలని నాయకులు కోరారు. నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు జరగక పోవడం వలన అభివృద్ధి కుంటుపడిందని పలువురు నాయకులు చెప్పారు. తీరప్రాంత గ్రామమైన వాడరేవు పంచాయతీ అభివృద్ధి, తీరప్రాంత పరిరక్షణకు కీర్తివారిపాలెం వద్ద టోల్‌గేట్ ఏర్పాటుకు ఎమ్మెల్యేను తాము కోరామన్నారు. అదే విధంగా వేటపాలెం మండలం రామాపురంలో కూడా టోల్‌గేట్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని చెప్పారు. వాహనాల ద్వారా రుసుము రూపేణా వచ్చిన మొత్తాన్ని పారదర్శకంగా గ్రామాల అభివృద్ధికి వెచ్చిస్తారని చెప్పారు. అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి మంచి సలహాలు ఇవ్వాలే కాని నిరాధార ఆరోపణలు సరికాదన్నారు. డీపీవో మంజూరు చేసిన అనుమతిపత్రం నకళ్లను అందజేశారు. అనుమతి పత్రంలో కీర్తివారిపాలెం వద్ద పార్కింగ్ కోసమని, అందుకు సంబంధించి వచ్చిన రుసుమును గ్రామ పంచాయతీ నిధులకు జమ చేయాలని అందులో ఉంది. అయితే కీర్తివారిపాలెంకు వాడరేవు సముద్ర తీరానికి సుమారు ఒకటిన్నర కిలోమీటరు దూరం ఉంటుంది. అంటే వాహనాలు కీర్తివారిపాలెం వద్ద పార్కింగ్ చేసి వెళ్లాలా లేకుంటే, తీరంలో పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం కేటాయించి అక్కడ వాహనాలు పార్కింగ్, వాటికి భద్రత కల్పిస్తారా అనే విషయాలపై స్పష్టత లేదు. ఈ క్రమంలో సూర్యలంక వద్ద ఉన్న టోల్‌గేట్ అంశాన్ని ప్రస్తావించారు. సమావేశంలో కూటమి నాయకులు కౌతవరపు జనార్దనరావు, గంజి పురుషోత్తమ్, గుద్దంటి చంద్రమౌళి, గజవల్లి శ్రీనివాసరావు, గూడూరి శివరామప్రసాద్, జంగిలి రాముడు, బందు గురవయ్య, పిక్కి నారాయణ, ఉల్లిపాయల సుబ్బయ్య, సత్యానందం, కూటమి నాయకులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కూటమి నాయకులు



ర్యాలీ నిర్వహిస్తున్న పోస్టల్ ఉద్యోగులు

సేవింగ్ స్కీములపై అవగాహన ర్యాలీ

మార్టూరు, సెప్టెంబరు 11 : పోస్టాఫీస్ సేవింగ్ స్కీములపై ప్రజలకు అవ గాహన కలిగించేందుకు పోస్టల్ ఉద్యోగులు బుధవారం మార్టూరులో ర్యాలీ నిర్వహించారు. మార్టూరు పరిధిలో ఉన్న 18 గ్రామాల బ్రాంచి పోస్ట్ మాస్టర్లు, ఉప బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు డాక్‌చోప్‌లో భాగంగా సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా చీరాల ఏఎస్పీ జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. మార్టూరు బ్రాంచి పోస్ట్ మాస్టర్ జి.అక్కయ్య ఆధ్వర్యంలో బ్రాంచి ఆఫీసు నుంచి ర్యాలీగా వెళ్తూ సేవింగ్స్ స్కీములపై కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంపీడీవో జీ నితిన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పోస్టాఫీస్‌లో పథకాలు, సేవలపై ఏఎస్పీ వివరించారు. ప్రజలు పథకాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పోస్టల్ ఉద్యోగులు పాల్గొన్నారు.



రోడ్డు మధ్యలో నిలిచిన పోయిన లారీ

గోతులలో నిలిచిన గ్రానైట్ లారీ

నిలిచిన ట్రాఫిక్

బల్లికురవ, సెప్టెంబరు 11 : మండల పరిధిలోని బల్లికురవ మార్టూరు అర్‌అండ్‌బీ రోడ్డులో ఉన్న పెద్ద పెద్ద గోతులతో వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బుధవారం వీర్లకొండ గ్రానైట్ క్వారీ నుంచి మార్టూరు వెళుతున్న రాయి లారీ గోతుల వద్దకు వచ్చే సరికి ఒక్కసారిగా మర్మతులకు గురై రోడ్డు మధ్యలో నిలిచిపోయింది. దీంతో ఈ మార్గంలో సుమారు రెండు గంటల పైబడి ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. ప్రతి రోజు గోతుల రోడ్డులో ఇలాంటి పరిస్థితి ఉంటుందని తక్షణమే అధికారులు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. బల్లికురవ నుంచి నక్కబొక్కలపాడు, నాగరాజుపల్లి గ్రామాల వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నదని, గోతులలో గ్రానైట్ పలకలు వేయడం వలన వాహనాలు చెడిపోతున్నాయని వారు ఆరోపిస్తున్నారు.

ఐదోరోజు వైభవంగా వినాయక ఉత్సవాలు

పంగులూరు, సెప్టెంబరు 11 : ఐదోరోజు వినాయచవితి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మండలపాల వద్ద పెద్దఎత్తున పూజలు, ప్రసాద వితరణ, అన్నదానాలు నిర్వహిస్తున్నారు. రాత్రివేళ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. బుధవారం తెలుగు యువత నాయకులు సతీష్ దంపతులు పూజలు నిర్వహించారు.

రూ.లక్ష నాణాలతో లంబోదరుడికి అలంకరణ

అద్దంకి, సెప్టెంబరు 11 : అద్దంకి పట్టణంలోని ఇందిరానగర్ బ్రాహ్మణ బజార్ లో ఏర్పాటు చేసిన వినాయక వి గ్రహం కు బుధవారం నాణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. లక్షా పదహారు రూపాయల విలువైన ఒక రూపాయి, రెండు రూపాయలు, ఐదు రూపాయల నాణెములు తో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అద్దంకి పట్టణంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన వి గ్రహాలను బుధవారం ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేశారు. ఆయా ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వినాయక వి గ్రహాల వద్ద భక్తులు పూజలు నిర్వహిస్తూ, ప్రసాదాలు పంపిణీ చేశారు.



పూజలు అందుకుంటున్న గణపయ్య



ఇందిరానగర్ బ్రాహ్మణ బజార్‌లో విగ్రహానికి లక్ష నాణాలతో అలంకరణ

నేడు మంత్రి పర్యటన

అద్దంకి, సెప్టెంబరు 11 : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గురువారం అద్దంకి నియోజకవర్గంలో పలు కార్య క్రమాలకు హాజరుకానున్నారు. ఉదయం 9-30 గంటలకు అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లో కొత్త బస్సులను రవికుమార్ ప్రారంభించనున్నారు. 11 గంటలకు పంగులూరు మండలం చందలూరులో జరిగే కార్యక్రమానికి మంత్రి హాజరు కానున్నారు.